

హరోం హర.. శంభో శంకర!



గ్రేటర్ 86వ వార్డు మాతృశ్రీ నగర్‌లోని విశ్వేశ్వరాలయంలో...

భక్తిశ్రద్ధలతో శివరాత్రి పూజలు

- జిల్లావ్యాప్తంగా కిటకిటలాడిన ఆలయాలు
- లింగోద్భవ దర్శనానికి క్యూ కట్టిన భక్తులు
- ఆర్‌కే బీచ్‌లో అట్టహాసంగా మహా కుంభాభిషేకం



అప్పికొండ సోమేశ్వరుడు

విశాఖపట్నం, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి):

ఓం నమఃశివాయః...హర హర మహా దేవ..శంభో శంకర...అంటూ శివ నామ స్మరణతో విశాఖ నగరం బుధవారం హోరెత్తిపోయింది. మహా శివరాత్రి కావడంతో జిల్లావ్యాప్తంగా శైవక్షేత్రాలు కిటకిటలాడాయి. తెల్లవారుజాము నుంచి ఆలయాల ఎదుట భక్తులు బారులు తీరారు. ఉదయం నాలుగు గంటలకు మొదలైన అభిషేకాలు మధ్యాహ్నం వరకూ నిరంతరం కొనసాగాయి. రామకృష్ణా బీచ్‌లో సుబ్బిరామిరెడ్డి ఏర్పాటుచేసిన శివలింగానికి మహా కుంభాభిషేకం నిర్వహించారు. ఈసారి ప్రయాగ్‌రాజ్ నుంచి తెప్పించిన పవిత్ర జలాలతో అభిషేకం చేశారు. భక్తులకు కూడా స్వయంగా అభిషేకం చేసే అవకాశం కల్పించారు. బీచ్‌లో కోటి శివలింగాలతో మహా శివలింగం ఏర్పాటుచేశారు. సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటుచేశారు. సినీ నటులు బ్రహ్మానందం ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మాడుగుల నాగఫణి శర్మకు 'అవధాన బ్రహ్మ' బిరుదుతో సత్కరించారు. అప్పికొండలో సోమేశ్వర ఆలయం భక్తజనంతో కిటకిటలాడింది. ఇక్కడి ఏర్పాట్లను కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్ పర్యవేక్షించారు. అదేవిధంగా ఎంవీపీ కాలనీలోని ముక్తేశ్వరస్వామి ఆలయంలో ఉన్న శివలింగాలకు భక్తులు స్వయంగా అభిషేకాలు చేశారు. భీమిలి, పెందుర్తి, సింహాచలం, రుషికొండలోని శివాలయాల్లో ప్రత్యేక పూజలు, రుద్రాభిషేకాలు జరిగాయి. నక్కవానిపాలెం, కేఆర్‌ఎం కాలనీ, మాధవధార ఆలయాల్లో స్వామి దర్శనానికి భక్తులు భారీగా బారులు తీరారు. ప్రతి శివాలయంలోను జాతర వాతావరణం నెలకొంది. పలు అపార్టుమెంట్లలో ప్రత్యేకంగా శివలింగాలు ఏర్పాటుచేసి రుద్రాభిషేకాలు నిర్వహించారు. అర్ధరాత్రి లింగోద్భవ సమయంలో నిర్వహించే పూజల కోసం భక్తులు 11 గంటలకే ఆలయాలకు చేరుకున్నారు. శివరాత్రి రోజు రాత్రి అంతా మేల్కొని ఉండి, శివ నామ స్మరణ చేసి మరుసటిరోజు ఉదయం సముద్ర స్నానాలు చేయడం ఆనవాయితీ. వీటికి కూడా అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు.



ఆర్కే బీచ్‌లో మహా కుంభాభిషేకం చేస్తున్న కేంద్ర మాజీ మంత్రి సుబ్బిరామిరెడ్డి



అభిషేకం చేసేందుకు బారులు తీరిన భక్తులు

నేడు పాఠశాలలకు సెలవు

విశాఖపట్నం, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి):

ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానానికి గురువారం పోలింగ్ జరుగుతున్నందున జిల్లాలోని అన్ని యాజమాన్యాల పరిధిలో పాఠశాలలకు సెలవు ప్రకటించామని డిప్యూటీ డీఈవో ఎ.సోమేశ్వరరావు తెలిపారు. ఉన్నత పాఠశాలల విద్యార్థులకు బోధించే టీచర్లకు మాత్రమే ఓటు హక్కు ఉన్నప్పటికీ, ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలకు కూడా సెలవు ప్రకటించాలని కలెక్టర్ ఆదేశాలు జారీచేశారన్నారు. ఈ విషయాన్ని పాఠశాలల నిర్వాహకులు గమనించాలని సూచించారు.

నేడే ఎమ్మెల్సీ ఎన్నిక

ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకూ పోలింగ్

- ఆరు జిల్లాల్లో 22,493 మంది ఓటర్లు
- పురుషులు 13,508, మహిళలు 8,985
- పోలింగ్ కేంద్రాలు 123
- పోలింగ్ సిబ్బంది 739 మంది
- 3న ఓట్ల లెక్కింపు

విశాఖపట్నం, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి):

ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానానికి గురువారం పోలింగ్ జరగనున్నది. ఉదయం ఎనిమిది గంటలకు ప్రారంభమై సాయంత్రం నాలుగు గంటలకు ముగియనున్నది. అందుకు తగిన ఏర్పాట్లు అధికారులు పూర్తిచేశారు. ఈ ఎన్నికకు రిటర్నింగ్ అధికారిగా విశాఖ కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిరప్రసాద్ వ్యవహరిస్తుండగా, శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, విజయనగరం, విశాఖపట్నం, అల్లూరి సీతారామరాజు, అనకాపల్లి జిల్లాల రెవెన్యూ అధికారులు అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులుగా ఉన్నారు.

ఆరు జిల్లాల పరిధిలో 22,493 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో పురుషులు 13,508 మంది, మహిళలు 8,985 మంది ఉన్నారు. పోలింగ్ కోసం ... మిగతా 6వ పేజీలో



ఎన్నికల సమగ్రితో పోలింగ్ కేంద్రానికి చేరుకున్న సిబ్బంది



పాకలపాటి రఘువర్మ



శ్రీనివాసులు నాయుడు



కోరెడ్ల విజయగౌరి

ముగ్గురి మధ్య ప్రధాన పోటీ

బరిలో పది మంది అభ్యర్థులు ఉండగా ముగ్గురి మధ్యే ప్రధాన పోటీ నెలకొంది. నుంకరి శ్రీనివాసరావు పోటీ నుంచి తప్పుకుంటున్నట్టు వారం క్రితం ప్రకటించారు. ఆయన రఘువర్మకు మద్దతు పలికారు. కాగా సిట్టింగ్ ఎమ్మెల్సీ పాకలపాటి రఘువర్మకు కొన్ని ఉపాధ్యాయ సంఘాలతోపాటు టీడీపీ, జనసేన మద్దతు ప్రకటించాయి. మరో అభ్యర్థి గాదె శ్రీనివాసులనాయుడుకు కొన్ని ఉపాధ్యాయ సంఘాలు మద్దతు తెలిపాయి. అదేవిధంగా కూటమి భాగస్వామి అయిన బీజేపీకి చెందిన కొందరు నాయకులు సంఘీ భావం ప్రకటించారు. కోరెడ్ల విజయగౌరికి వామపక్షాలకు అనుబంధంగా ఉండే ఉపాధ్యాయ సంఘాలు మద్దతు తెలిపాయి. సాంకేతికంగా బ్యాలెట్‌లో 10 మంది పేర్లు ఉండగా...వారిలో ఒకరు తప్పుకున్నారు. మిగిలిన తొమ్మిది మందిలో ప్రధానంగా పాకలపాటి రఘువర్మ, గాదె శ్రీనివాసుల నాయుడు, కోరెడ్ల విజయగౌరి మధ్యే పోటీ ఉంది.

గ్రేటర్‌లో కమీషన్ కలకలం

నాలుగు శాతం మామ్ముళ్లు తీసుకుని అడ్డగోలుగా బిల్లులు ప్రాసెస్

- జీవీఎంసీ అకౌంట్స్ విభాగంపై కాంట్రాక్టర్ల ఆరోపణలు
- అధికార వర్గాల్లో తీవ్రస్థాయిలో చర్చ
- ఇన్‌చార్జి కమిషనర్, కలెక్టర్ ఆరా



విశాఖపట్నం, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి):

జీవీఎంసీ అకౌంట్స్ విభాగం నాలుగు శాతం కమీషన్ తీసుకుని అడ్డదారిలో బిల్లులు చెల్లింపులు జరుపుతున్నట్టు కొందరు కాంట్రాక్టర్లు చేస్తున్న ఆరోపణలు అధికార వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి. నిబంధనలకు విరుద్ధంగా బిల్లులు చేసేందుకు కాంట్రాక్టర్ల సంఘంలోని కొందరు పెద్దలు అకౌంట్స్ విభాగంలోని వారికి భారీగా లంచాలు ఇవ్వడమే కాకుండా ఇతర కాంట్రాక్టర్లతో కూడా నాలుగు శాతం కమీషన్ ఇప్పించినట్టు ఇటీవల కొందరు ఆరోపించిన విషయం తెలిసిందే. దీనిపై పత్రికల్లో కథనాలు ప్రచురితమవ్వడంతో కాంట్రాక్టర్ల నుంచి అకౌంట్స్ విభాగంలో లంచాలు తీసుకున్నది ఎవరు?, ప్రాధాన్యక్రమాన్ని పక్కనపెట్టి బిల్లులు చేసిందెవరనే వివరాలు సేకరించే పనిలో ఉన్నతాధికారులు ఉన్నారు. దీనిపై జిల్లా కలెక్టర్, జీవీఎంసీ ఇన్‌చార్జి కమిషనర్ ఎంఎన్ హరేంధిరప్రసాద్ కూడా దృష్టి సారించినట్టు చెబుతున్నారు. అకౌంట్స్ విభాగంలో ఒకే పోస్టులో చాలాకాలంగా కొనసాగుతున్న ... మిగతా 6వ పేజీలో

పల్సస్ ఉద్యోగుల పాట్లు

జీతాలు ఇవ్వడం లేదని కొద్దిరోజులుగా ఆందోళన

- పీఎఫ్ సరిగా చెల్లించడం లేదని ఆవేదన
- పాత ఉద్యోగులను కొత్త రోల్స్‌లో చూపిస్తున్నారనే వాదన
- ఆఫీస్ ముందు ధర్నా చేస్తున్నారని 'వర్క్‌ఫ్రమ్ హోమ్'
- నెల పూర్తయ్యేసరికి ఆఫీస్‌కు రాలేదని జీతం కోత
- యాజమాన్యంపై ఉద్యోగుల తీవ్ర ఆరోపణలు



పల్సస్ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న ఉద్యోగులు (ఫైల్)

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

'పల్సస్' కంపెనీ తీవ్ర ఆరోపణలు ఎదుర్కొంటోంది. తమకు జీతాలు ఇవ్వడం లేదని గత కొంతకాలంగా ఉద్యోగులు ఆఫీస్ ముందే ధర్నాలు చేస్తున్నారు. ఇప్పుడు కొత్తగా తమ ప్రావిడెంట్ ఫండ్ ఖాతాలు స్తంభింపజేశారని, విత్‌డ్రా చేసుకోవడానికి వీలు కావడం లేదని ఆరోపిస్తున్నారు. రోజుకొక సమస్యతో ఉద్యోగులు రోడ్డెక్కుతున్నారు.

'పల్సస్' సీఈవో గేదెల శ్రీనుబాబు ఇంతకు ముందు హైదరాబాద్‌లో ఒమిక్స్ ఇంటర్నేషనల్ ప్రైవేటు లిమిటెడ్ పేరుతో కంపెనీ పెట్టి హెల్త్‌కేర్ రంగంలో ఐటీ సేవలు అందించేవారు. ఆ తరువాత విశాఖపట్నంలోని విప్రో భవనంలో మూడు అంతస్థులు అద్దెకు తీసుకొని అందులో ఒమిక్స్ కార్యాలయం ఏర్పాటుచేశారు. ఇక్కడకు వచ్చిన తరువాత ఆయనకు రాజకీయాలపై ఆసక్తి పెరిగింది. జనసేనలో చేరారు. 2019 ఎన్నికల్లో విశాఖ ఎంపీగా పోటీ చేసే అవకాశం ఇవ్వాలని పార్టీ అధినేత పవన్ కల్యాణ్ భావించారు. అయితే ఆఖరి నిమిషంలో శ్రీనుబాబు వైసీపీలో వెళ్లిపోయారు. ఆ ఎన్నికల్లో ఆయనకు పోటీ చేసే అవకాశం రాలేదు. 2024 ఎన్నికలకు ముందు మళ్లీ యాక్టివ్ అయ్యారు. ఉత్తరాంధ్ర జిల్లాల్లో యువతకు భారీఎత్తున ఉపాధి కల్పిస్తున్నట్టు హోర్డింగులు పెట్టి ప్రచారం చేసుకున్నారు. తెలుగుదేశం పార్టీ తరఫున విజయనగరం నుంచి ఎంపీగా పోటీ చేయడానికి యత్నించారు. అక్కడ అవకాశం లేదని తెలిసి బీజేపీ నుంచి ప్రయత్నం చేశారు. అక్కడా అవకాశం లభించలేదు.

ఇదిలావుండగా 'పల్సస్'లో ఉద్యోగులకు జీతాలు ఇవ్వలేని పరిస్థితి వచ్చింది. విప్రో ... మిగతా 6వ పేజీలో

ఉక్కులో ఉద్యోగాల కోత?

కాంట్రాక్టుకు క్వాలిటీ ఎష్యూరెన్స్ అండ్ టెక్నాలజీ డెవలప్‌మెంట్ (క్యుఏటీడీ) విభాగం

మూడు రోజుల క్రితం ప్రకటన

- ఏడాదికి రూ.4.2 కోట్లు చెల్లిస్తామంటూ ఆఫర్
- ఉద్యోగులు, కార్మికుల్లో ఆందోళన
- తరవాత రోలింగ్ మిల్స్ విభాగం వంతు?
- నిర్వాసితులకు ఇక ఉద్యోగాలు రానట్టేనా!?



స్టీల్‌ప్లాంటు

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

స్టీల్ ప్లాంటు యాజమాన్యం ఉద్యోగుల సంఖ్యను తగ్గించుకోవడానికి అన్నిరకాల ప్రయత్నాలూ చేస్తోంది. దశలవారీగా ఒక్కో విభాగాన్ని ప్రైవేటుకు అప్పగించేందుకు చర్యలు చేపడుతోంది. తాజాగా ప్లాంటులో అత్యంత కీలకమైన క్వాలిటీ ఎష్యూరెన్స్ అండ్ టెక్నాలజీ డెవలప్‌మెంట్ (క్యుఏటీడీ) విభాగాన్ని కాంట్రాక్టుకు ఇస్తామంటూ మూడు రోజుల క్రితం ప్రకటన జారీచేసింది. ఇది అత్యంత కీలకమైన విభాగం. ఇక్కడ సుమారుగా 100 మంది వరకు శాశ్వత ఉద్యోగులు పనిచేస్తున్నారు. ప్లాంటుకు వచ్చే రా మెటీరియల్ నుంచి వీరు శాంపిల్స్ సేకరించి, నిర్దేశించిన నాణ్యతకు అనుగుణంగా ఉన్నాయా? లేదా? అని పరీక్షించి సర్టిఫై చేస్తారు. అలాగే దశల వారీగా జరిగే ఉక్కు ఉత్పత్తిలో కూడా నమూనాలు తీసి, వాటి నాణ్యతను కూడా నివేదిస్తారు. ఇక్కడ ఎన్ఎంఆర్‌లు కూడా కొంతమంది పనిచేస్తున్నారు. ఇప్పుడు ఈ విభాగం నిర్వహణ మొత్తం కాంట్రాక్టుకు ఇస్తామని, అందుకుగాను ఏడాదికి రూ.4.2 కోట్లు చెల్లిస్తామని యాజమాన్యం ప్రకటించింది. అంటే ఎంతమందిని పనికి పెట్టుకుంటారనే దానితో సంబంధం లేకుండా నమూనాలు సేకరించి, నివేదికలు ఇస్తే చాలనే ధోరణి కనపడుతోంది. కొత్తగా కాంట్రాక్ట్ తీసుకునే వారికి ఈ పనులన్నీ నేర్పించిన తరువాత ఈ విభాగంలో పనిచేస్తున్న వారిని అక్కడి నుంచి తప్పించే విధంగా ప్రణాళిక సిద్ధం చేశారు. ఇది పూర్తయిన వెంటనే రోలింగ్ మిల్స్‌ను కూడా కాంట్రాక్టుకు ఇవ్వడానికి ఏర్పాట్లు జరుగుతున్నాయని ఉద్యోగ వర్గాల సమాచారం. ఒకపక్క వీఆర్‌ఎస్ పేరుతో 1,100 మందిని ఇంటికి పంపించేస్తూ, మరోవైపు మూడో బ్లాస్ట్ ఫర్నేస్‌ను ప్రారంభించడానికి సన్నాహాలు చేస్తున్నారు. ఉద్యోగులను తగ్గించినప్పుడు పూర్తిస్థాయి ఉత్పత్తి ఎలా సాధ్యమని కార్మిక సంఘాలు ప్రశ్నిస్తున్నాయి. ఫిబ్రవరి నెలకు సంబంధించి రెండు బ్లాస్ట్ ఫర్నేస్‌ల ద్వారా 92 శాతం ఉత్పత్తి తీయాలని లక్ష్యం ఇస్తే, ఉద్యోగుల సంఖ్య తక్కువగా ఉన్నప్పటికీ దానిని మించి చేశామంటున్నాయి.

నిర్వాసితులకు ఇక ఉద్యోగాలు రానట్టేనా!?

స్టీల్‌ప్లాంటు ఏర్పాటుకు ... మిగతా 6వ పేజీలో

• ఆకట్టుకున్న భరతనాట్య ప్రదర్శన



ఆర్కే బీచ్‌లో బుధవారం సాయంత్రం తన బృందంతో కలిసి ప్రదర్శన ఇస్తున్న రమా వైద్యనాథన్ -7లో

• నాగఫణిశర్మకు అవధాన బ్రహ్మ



మాడుగుల నాగఫణిశర్మను సత్కరిస్తున్న కేంద్ర మాజీ మంత్రి టి.సుబ్బిరామిరెడ్డి, భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, సినీనటుడు బ్రహ్మానందం తదితరులు -7లో

• బీచ్‌రోడ్డు కిటకిట



ఆర్కే బీచ్ రోడ్డు బుధవారం సాయంత్రం నుంచి కిటకిటలాడింది. శివరాత్రి జాగారం చేసేవారంతా కాలక్షేపం కోసం బీచ్‌కు చేరుకోవడంతో సందడి వాతావరణం నెలకొంది.


భీమునిపట్నం : భీమిలి ఆలయాల సముదాయంలో భక్తుల రద్దీ


భీమునిపట్నం : దర్శనలకు క్యూ కట్టిన భక్తులు


చోడేశ్వరాలయం వద్ద అభిషేకాలు చేస్తున్న భక్తులు


కొమ్మాది : మారికవలస శివాలయంలో పూజలు

హరోం హరా.. శంభో శివ శంకరా..

- శివనామ సంకీర్తనతో మార్మోగిన శైవాలయాలు
- శివరాత్రి సందర్భంగా వేకువ జాము నుంచే ప్రత్యేక పూజలు, అభిషేకాలు

భీమునిపట్నం, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): మహా శివరాత్రి పర్వదినాన్ని భక్తుల భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. తెల్లవారుజాము నుంచే భక్తులు పరిసర గ్రామాల నుంచి పట్టణంలోని పురాతన శ్రీ భ్రమరాంబికా సహిత చోడేశ్వరాలయానికి, శ్రీకాత్యాయిని సహిత భీమేశ్వరాలయం, శ్రీ బాలాత్రిపుర సుందరి సహిత చంద్రశేఖర ఆలయాల సముదాయాలకు చేరుకున్నారు. స్వయంభు ఆలయమైన శ్రీచోడేశ్వరాలయం వద్ద భక్తులు అధికసంఖ్యలో క్యూ కట్టారు. నేరేళ్లవలస ఎండోమెంట్ రిష్పన్ హూర్‌హౌస్ ప్రాంగణంలోని పురాతన శ్రీశివాలయం, రామాద్రి ప్రాంగణంలో ఉన్న శ్రీశివాలయాన్ని కూడా భక్తులు దర్శించుకున్నారు. ముందస్తు చర్యల్లో భాగంగా పట్టణంలోని శ్రీఆలయాల సముదాయం వద్ద, మెయిన్ రోడ్‌లో ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా పోలీసు బందోబస్తు, ట్రాఫిక్ పోలీసులను పోలీసు సీఐ సుధాకర్ ఏర్పాటు చేశారు. మధ్యాహ్నం వరకూ భక్తులు ఆలయాలను దర్శించుకున్నారు. తిరిగి సాయంత్రం భక్తుల రద్దీ పెరిగింది. భీమిలి కృష్ణాకాలనీలో ఉన్న శ్రీ యోగాశ్రమంలో నిర్వాహకులు సీహెచ్ వెంకటరావు ఆధ్వర్యంలో సామూహిక రుద్రాభిషేకాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గొల్లవీధి శ్రీ కృష్ణ జంక్షన్ నుంచి యాదవ సంఘం ఆధ్వర్యంలో దాసరికంతో భక్తులు ప్రసిద్ధ శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయానికి దాసరికంతో బయలుదేరారు.

భక్తులతో కిటకిటలాడిన శివాలయాలు

మధురవాడ, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి) మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా మధురవాడ పరిసరాల్లోని శివాలయాలు బుధవారం వేకువజాము నుండే భక్తులతో కిటకిటలాడాయి. మానం ఆంజనేయనగర్‌లోని లలితత్రిపుర సుందరీదేవి సమేత మహాకామేశ్వరస్వామి వారి ఆలయంలో భక్తులు రుద్రాభిషేకాలు చేశారు. ఆలయ ధర్మకర్త బొడ్డేపల్లి సురేష్ ఆధ్వర్యంలో భక్తులకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఇదే ఆలయంలో గర్భగుడిలోని శివలింగానికి అర్చకులు పంచామృతాభిషేకాలు చేశారు. మిథిలాపురి వుడాకాలనీలోని ఉమా రామలింగేశ్వరస్వామి వారి ఆలయంలో భక్తులు పెద్ద సంఖ్యలో ముక్కంటిని దర్శించుకొని అభిషేకాలు నిర్వహించారు. స్వతంత్రనగర్ కాలనీ, అయోధ్య నగర్, లా కళాశాల, వాంబే కాలనీ తదితర ప్రాంతాల్లో భక్తులు శివుడి దర్శనానికి బారులు తీరారు. ఆలయ కమిటీలు భక్తులు కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేశాయి. బుధవారం రాత్రి జాగరణలు కోసం పలు ఆలయాలు వద్ద భక్తికార్యక్రమాలను ఏర్పాటు చేశారు.

కొమ్మాదిలో..

కొమ్మాది, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి) : మహాశివరాత్రి పర్వదినం పురస్కరించుకుని మధురవాడ పరిసర ప్రాంతాల్లోని శివాలయాలన్నీ భక్తులతో కిటకిటలాడాయి. మారికవలస కాశీవిశ్వేశ్వరపంచాయతన శివాలయంలో మన్యాలసోంబాబు ఆధ్వర్యంలో మహాశివరాత్రి వేడుకలు ఘనంగా నిర్వహించారు. వేకువ జాము నుంచే భక్తులు ఆలయానికి పోటెత్తారు. ఆలయంలో మధ్యాహ్నం మహారుద్రాభిషేకం నిర్వహించారు. అనంతరం పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కొమ్మాది అష్టలక్ష్మీదేవాలయం ప్రాంగాణంలోని వైశాఖేశ్వరస్వామి ఆలయంలో భక్తుల స్వహస్తాలతో సామూహిక రుద్రాభిషేకాలు, అఘోరపాశుపత రుద్రహోమాలు ఆలయ అర్చకులు చక్రధరశర్మ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. రాజీవ్ గృహకల్ప కాలనీ, కార్పెంటర్స్ కాలనీ, పీఎం పాలెం శివారు యడ్లమల్లేశ్వరస్వామి ఆలయాలు శివనామ స్మరణతో మార్మోగాయి.


మధురవాడ : మానం ఆంజనేయనగర్ శివాలయంలో రుద్రాభిషేకాలు చేస్తున్న భక్తులు


పద్మనాభం : రెడ్డిపల్లి కృష్ణచంద్రబాబాజీ మఠం వద్ద అన్నదానం

సాగర్‌నగర్‌లో..

సాగర్‌నగర్, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి) : శివరాత్రి పురస్కరించుకుని రుషికొండ బాలాత్రిపుర సుందరి సమేత సప్తరుషీశ్వరాలయం, సాగర్‌నగర్ సాగరేశ్వరాలయం బుధవారం భక్తులతో కిటకిటలాడాయి. వేకువజాము నుంచే భక్తులు ఆలయాలువద్ద బారులు తీరారు. గణపతి పూజతో పూజా కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. శివనామస్మరణతో ఆలయాలు మారుమ్రోగాయి. ఈ సందర్భంగా రుద్రాభిషేకాలు, పంచామృతాభిషేకాలు నిర్వహించారు. భక్తులు తీర్థప్రసాదాలు అందజేశారు.

ఆనందపురంలో..

ఆనందపురం, ఫిబ్రవరి 26 : మహా శివరాత్రి పర్వదినాన్ని పురష్కరించుకుని బుధవారం మండలంలోని శివాలయాలు శివనామస్మరణతో మార్మోగాయి. భక్తులు తెల్లవారుజాము నుంచే శివాలయాలకు చేరుకుని శివలింగానికి వివిధ రకాల పండ్లరసాలు, పాలతో అభిషేకాలు నిర్వహించారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఆలయ కమిటీలు ప్రత్యేక చర్యలు చేపట్టాయి. అతి పురాతన దేవాలయమైన గుడిలోవ శ్రీరంగనాథ నారాయణేశ్వర ఆలయం, బోని అమరేశ్వర ఆలయాలకు భక్తులు అధిక సంఖ్యలో చేరుకుని భక్తిశ్రద్ధలతో పూజా కార్యక్రమాలు చేపట్టారు. అలాగే గిడిజాల, పొడుగుపాలెం, ఆనందపురం, ముకుందపురం, పెద్దిపాలెం, దుక్కవానిపాలెం, వెల్లంకి గ్రామాల్లో ఉన్న శివాలయాల్లో శివరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు.

పద్మనాభంలో..

పద్మనాభం, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి) : మండలంలో అన్ని గ్రామాల్లోని శివాలయాలు మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా శివనామస్మరణతో మార్మోగాయి. ఈ సందర్భంగా ఆయా ఆలయాలలో శివరాత్రి వేడుకలు భక్తిప్రపత్తులతో నిర్వహించారు. బుధవారం వేకువ జాము నుంచే పరమ శివుడికి పంచామృతాభిషేకాలు, విశేషార్చనలు చేశారు. పద్మనాభంలోని నారాయణేశ్వరాలయం,విలాస్‌ఖాన్‌పాలెం రామలింగేశ్వరాలయం, పొట్నూరు ఉమా నీలకంఠేశ్వరాలయం, కుర్రపల్లి శివాలయం రెడ్డిపల్లి ఉమారామ లింగేశ్వరాలయం, మద్దికాశీ విశ్వేశ్వరాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. రెడ్డిపల్లి కృష్ణ చంద్రబాబాజీ ప్రాంగణంలో సత్యసాయి భజన మండలి ఆధ్వర్యంలో నామ సంకీర్తన నిర్వహించారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు.

పరమశివుడికి భక్తిశ్రద్ధలతో పూజలు


శివుని దర్శనానికి బారులుదీరిన భక్తులు

సింహాచలం, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి) : మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని సింహగిరిపై, కొండదిగువ 98వ వార్డు పరిధిలోని పలు దేవాలయాల్లో పరమశివుడికి బుధవారరం పెద్దసంఖ్యలో భక్తులు పూజలు, అభిషేకాలు నిర్వహించారు. వేకువజామున నుంచే కొండదిగువ వరాహ పుష్కరిణి, సింహగిరిపై నిర్విరామంగా ప్రవహించు గంగధారలో పవిత్ర స్నానాలు ఆచరించారు.

పర్వదినం సందర్భంగా సింహగిరి క్షేత్ర పాలకుడు బాలత్రిపురసుందరి సహిత త్రిపురాతంకస్వామికి, కాశీవిశ్వేశ్వర స్వామివార్లకు వేకువజామున అర్చకులు మహాన్యాస పూర్వక ఏకవార రుద్రాభిషేకాలు జరిపి బిళ్వదళార్చనలు శైవాగమశాస్త్ర విధానంలో జరిపారు. అనంతరం సూర్యాస్తమయం వరకు వేలాది మంది సింహాచల గ్రామానికి చెందిన వారితో పాటు విశాఖ నగర నలుమూలల నుంచి తరలి వచ్చిన భక్తులు శివుడ్ని దర్శించుకుని అభిషేకాలు, పూజలు జరిపి మొక్కులు తీర్చుకున్నారు. లింగోద్భవ సమయంలో ఘనంగా పరమశివుడికి అర్చకులు సంప్రదాయబద్ధంగా విశేష అభిషేకాలు జరిపారు. భక్తుల రద్దీని నియంత్రించేందుకు దేవస్థానం అధికారులు విస్తృత ఏర్పాట్లు చేశారు.

అలాగే 98వ వార్డు పరిధి కాపువీధి, పాత అడివివరం, సింహపురి కాలనీ, విజినిగిరిపాలెం లోనిపలు ఆలయాల్లో కొలువుదీరిన ఈశ్వరాలయాల్లో కూడా శివరాత్రి పూజలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.

నేడే ఎమ్మెల్సీ ఎన్నిక

... 5వ పేజీ తరువాయి

ఆరు జిల్లాల పరిధిలో 123 కేంద్రాలు ఏర్పాటుచేశారు. ఎన్నికల నిర్వహణకు 739 మంది అధికారులను నియమించారు. వీరిలో 148 మంది పీవోలు, 148 మంది ఏపీవోలు, 295 మంది ఓపీవోలు ఉన్నారు. మరో 148 మంది మైక్రో అబ్జర్వర్లను నియమించారు. ఎన్నికల సిబ్బంది, మెటీరియల్‌ను బుధవారం సాయంత్రానికే కేంద్రాలకు తరలించారు. ఎన్నిక బ్యాలెట్ విధానంలో నిర్వహిస్తున్నారు. పోలింగ్ నేపథ్యంలో కేంద్రాల వద్ద పోలీస్ బందోబస్తు ఏర్పాటుచేశారు.

జిల్లాలో 13 పోలింగ్ కేంద్రాలు

విశాఖ జిల్లాలో 13 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటుచేశారు. నడుపూరు జడ్పీ ఉన్నత పాఠశాలలోని ఈ-బ్లాక్, గాజువాక జడ్పీ ఉన్నత పాఠశాలలోని ఆరో తరగతికి చెందిన అదనపు భవనం, పెందుర్తి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో రూమ్ నంబర్-10, చినవాల్తేరులోని ఏయూ ప్రాథమిక పాఠశాల, డాబాగార్డెన్స్‌లోని ప్రేమ ఉన్నత పాఠశాల, రైల్వే న్యూకాలనీలోని కేఎన్ఎం బాలికల పాఠశాల, కంచరపాలెంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ బ్లాక్, మల్కాపురంలో జీవీఎంసీ ప్రాథమిక పాఠశాల, గోపాలపట్నంలో జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో 10వ తరగతి గది, చంద్రంపాలెం జడ్పీ ఉన్నత పాఠశాల, పద్మనాభంలో ఎంపీపీ ప్రాథమిక పాఠశాల, ఆనందపురంలో ప్రాథమిక పాఠశాల, భీమిలిలో మహాత్మాగాంధీ యూపీ పాఠశాలల్లో పోలింగ్ కేంద్రాలు ఏర్పాటుచేశారు. అన్ని పోలింగ్ కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుంది.

ఓటు హక్కు ఎవరికి ఉంటుందంటే...

ఉన్నత పాఠశాలల్లో బోధన చేసే స్కూల్ అసిస్టెంట్లు, హెచ్‌ఎంలు, కేజీబీవీలు, రెసిడెన్సియల్, మోడల్ స్కూళ్లు, జూనియర్/డిగ్రీ కళాశాలలు, పాలిటెక్నిక్, ఇంజనీరింగ్, యూనివర్సిటీ కళాశాలల అధ్యాపకులు, ప్రైవేటు పాఠశాలల్లో స్కూలు అసిస్టెంట్ కేడర్‌లో ఉన్న టీచర్లకు ఓటు హక్కు ఉంటుంది. ఈ ఎన్నికల్లో ఓటరు ప్రాధాన్యతా క్రమంలో ఓటు హక్కు వినియోగించుకోవచ్చు. ఉదాహరణకు ఒక అభ్యర్థికి మొదటి ప్రాధాన్య ఓటు వేస్తున్నట్టు అయితే పేరుకు ఎదురుగా ఉన్న గడిలో 'ఒకటి' అని నంబరు వేయాలి. అంతే తప్ప టిక్‌లు పెట్టరాదు. ఓటరుకు బ్యాలెట్ పేపరుతోపాటు స్కెచ్ పెన్ను ఇస్తారు. ఆ పెన్ మాత్రమే ఉపయోగించి ఓటువేయాలి తప్ప ఇతర పెన్నులు వాడరాదు.

మూడో తేదీన ఓట్ల లెక్కింపు

ఎన్నికలలో కీలకమైన పోలింగ్ గురువారం సాయంత్రం నాలుగు గంటలతో ముగియనున్నది. నగరంలోని పోలింగ్ కేంద్రాల నుంచి బ్యాలెట్ బాక్సులను సాయంత్రం ఆరు గంటల తరువాత ఆంధ్ర విశ్వవిద్యాలయం ఇంజనీరింగ్ కళాశాలలోని ఈఈఈ విభాగం బ్లాక్‌లో భద్రపరుస్తారు. మిగిలిన జిల్లాల నుంచి గురువారం రాత్రికి బ్యాలెట్‌బాక్సులు వస్తాయి. వచ్చే నెల మూడో తేదీన ఓట్ల లెక్కింపు జరుగుతుంది. దీనికి సంబంధించి కౌంటింగ్ సిబ్బందికి రెండు రోజుల్లో శిక్షణ ఇవ్వనున్నారు.

పోటీలో ఉన్న అభ్యర్థులు...

సిట్టింగ్ ఎమ్మెల్సీ పాకలపాటి రఘువర్మ, కోరెడ్ల విజయగౌరి, గాదె శ్రీనివాసులనాయుడు, కోసూరు రాధాకృష్ణ, నూకల సూర్యప్రకాష్, రాయల సత్యనారాయణ, సత్తలూరి పద్మావతి, పెదపెంకి శివప్రసాద్, పోతల దుర్గాప్రసాద్, సుంకర శ్రీనివాసరావు (ఈయన పోటీ నుంచి తప్పుకుంటున్నట్టు వారం క్రితం ప్రకటించారు)

పల్సస్ ఉద్యోగుల పాట్లు

... 5వ పేజీ తరువాయి

భవనం ఖాళీ చేసి రుషికొండకు కార్యాలయం మార్చారు. అక్కడ 350 మంది వరకు పనిచేస్తున్నారు. నవంబరు నెల జీతంలో సగం డిసెంబరులో ఇచ్చి, మిగిలిన సగం జనవరిలో పండుగ ముందు అది కూడా కొందరికే ఇచ్చారు. డిసెంబరు జీతాలు ఇవ్వలేదు. ఎవరైనా జీతాలు ఎప్పుడు ఇస్తారని హెచ్‌ఆర్ ఉద్యోగిని ప్రశ్నిస్తే ఆమె హైదరాబాద్ వెళ్లి యాజమాన్య ప్రతినిధులను అడగాలని సూచించేది. స్థానికంగా శ్రీనుబాబు సోదరుడు శంకర్ డైరెక్టర్‌గా ఉన్నా సమస్య పరిష్కారం కాలేదు. ఇటీవల కొందరిని హైదరాబాద్ బదిలీ చేశారు. స్థానికంగానే ఉండవచ్చునని, ఇక్కడ తక్కువ జీతాలకు పనిచేశామని, హైదరాబాద్‌కు తీసుకువెళ్లి అవే జీతాలు ఇస్తే ఎలా సరిపోతాయని వాపోతున్నారు.

పీఎఫ్ ఖాతాలు స్తంభన

ఉద్యోగులకు సంబంధించి ప్రతి నెలా ప్రావిడెంట్ ఫండ్ కంపెనీ జమ చేయాలి. కానీ అది కూడా సరిగా చెల్లించడం లేదని ఉద్యోగులు తెలుసుకొని, తమ ఖాతాల్లో ఎంత ఉంటే అంత తీసుకోవాలని యత్నించారు. ఈ క్రమంలో వారి ఖాతాలు డిసెంబరులో స్తంభించినట్టు తెలిసి హతాశులయ్యారు. ఎప్పటి నుంచో పనిచేస్తున్న వారిని కొత్త ఉద్యోగులుగా చూపిస్తున్నారని కూడా ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఎక్కువ మందికి తాను ఉపాధి కల్పిస్తున్నట్టు ప్రచారం చేసుకోవడానికి ఇలా చేస్తున్నారని ఉద్యోగులు ఆరోపిస్తున్నారు.

వర్క్ ఫ్రమ్ హోమ్

ఉద్యోగులు జీతాలు ఇవ్వడం లేదని కార్యాలయం ముందు ధర్నా చేయడం, పత్రికల్లో వార్తలు రావడంతో కొత్త ఎత్తుగడ వేశారు. ఎవరూ ఆఫీస్‌కు రావద్దని ఇంటి నుంచే పనిచేయాలని 'వర్క్ ఫ్రమ్ హోమ్' నోటీసులు పంపించారు. అయితే ఉద్యోగుల ఇళ్లలో ఎటువంటి కంప్యూటర్లు ఏర్పాటు చేయలేదు. ఇంటర్నెట్ సౌకర్యం కల్పించలేదు. జీతాలు ఎప్పుడు ఇస్తారో తెలియని ఉద్యోగానికి ఇప్పుడు తాము అవన్నీ ఎక్కడ నుంచి సమకూర్చుకుంటామని ఉద్యోగులు ప్రశ్నిస్తున్నారు. గతంలో కూడా ఇలాగే చేశారని, అప్పుడు లక్ష్యాలు సాధించలేకపోయిన వారికి, ఆఫీస్‌కు రాలేదని రిమార్కు చూపించి జీతాలు ఇవ్వలేదని కొందరు ఉద్యోగులు ఆరోపించారు. సంస్థను సరిగ్గా నిర్వహించే ఉద్దేశం యాజమాన్యంలో కనిపించడం లేదని తమకు రావలసిన జీతం బకాయిలు ఇప్పించడానికి స్థానిక నాయకులు యత్నించాలని వారంతా డిమాండ్ చేస్తున్నారు.

ట్రిబ్యునల్‌లో కేసు ఉంది

- గేదెల శ్రీనుబాబు, సీఈఓ, పల్సస్

నిబంధనలకు లోబడే ఉద్యోగులను హైదరాబాద్‌కు తరలించాం. విశాఖలో కొంతమంది ఉద్యోగుల యూనివర్సల్ అకౌంట్ నంబర్లను ఈపీఎఫ్ఓ బ్లాక్ చేసింది. దాంతో సమస్య ఏర్పడింది. దీనిపై మేము సెంట్రల్ గవర్నమెంట్ ఇండస్ట్రియల్ ట్రిబ్యునల్‌ను ఆశ్రయించాము. సంస్థకు అనుకూలంగా తీర్పు వచ్చింది. త్వరలో సమస్య పరిష్కారం అవుతుంది.

ఉక్కులో ఉద్యోగాల కోత?

... 5వ పేజీ తరువాయి

భూములు ఇచ్చిన రైతులకు ఉద్యోగాలు ఇస్తామని అప్పట్లో ప్రకటించారు. వారిలో కొందరికే ఇచ్చారు. ఇంకా ఉద్యోగాలు పొందాల్సిన నిర్వాసితులు ఎనిమిది వేల మంది ఉన్నారు. ప్లాంటు విస్తరిస్తే తమకు ఉపాధి దొరుకుతుందని వారి వారసులు ఎదురుచూస్తున్నారు. అయితే యాజమాన్యం ఉన్నవారినే తొలగించుకుంటూ పోతుంటే...ఇక కొత్త ఉద్యోగాలు ఎక్కడ వస్తాయనే ప్రశ్న ఉత్పన్నమవుతోంది. దీనిని బట్టి భవిష్యత్తులో నిర్వాసితులకు ఉద్యోగాలు దొరికే అవకాశమే లేదనే వాదన వినిపిస్తోంది.

గ్రేటర్‌లో కమీషన్ కలకలం

... 5వ పేజీ తరువాయి

ఒక అధికారి...కమీషన్లు ఇస్తున్న కాంట్రాక్టర్ల బిల్లులు ప్రాసెస్ చేస్తున్నట్టు ఆరోపణలు ఉన్నాయి. తనకు అస్మదీయులైన, తనను ప్రసన్నం చేసుకున్న కాంట్రాక్టర్లను పిలిచి...ఏదో ఒక కారణంతో డబ్బు అవసరమైనందున త్వరగా బిల్లు చెల్లించాలని కమిషనర్‌కు ఒక దరఖాస్తు పెట్టిస్తుంటారని, ఆయన దానిని పరిశీలించాల్సిందిగా సూచిస్తే సదరు అధికారి వెంటనే బిల్లులను చెల్లిస్తుంటారని అంటున్నారు. వాస్తవంగా ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న కాంట్రాక్టర్లు కుటుంబసభ్యుల ఆరోగ్య సమస్యలు, పిల్లల చదువులు, పెళ్లిళ్ల కోసం డబ్బులు అవసరమై కమిషనర్‌కు దరఖాస్తు చేసుకుంటారు. ఆ దరఖాస్తును పరిశీలించాలని కమిషనర్ సదరు అధికారిని ఆదేశించినా సరే తనను ప్రసన్నం చేసుకోలేదనే సాకుతో వాటిని పక్కనపడేసేవారనే కాంట్రాక్టర్లు ఆరోపి స్తున్నారు. కాగా కాంట్రాక్టర్ల సం ఘంలో ఇప్పుడువర్గపోరు మొదలవ్వడంతో పోటాపోటీగా సమావేశాలు పెట్టి ఒకరిపై ఒకరు ఆరోపణలు చేసుకుంటున్నారు. అకౌంట్స్ విభాగంలోని అధికారి కోసమంటూ తమ నుంచి నాలుగు శాతం కమీషన్ కింద వసూలుచేసినందున సదరు అధికారి ఎవరనేది బయటపెట్టాలని కొందరు కాంట్రాక్టర్లు పట్టుబడుతున్నారు. ఈ వ్యవహారంపై జీవీఎంసీ ఇన్‌చార్జి కమిషనర్ అయిన జిల్లా కలెక్టర్ గట్టిగా దృష్టిసారిస్తే భవిష్యత్తులో అడ్డదారిలో బిల్లుల చెల్లింపునకు బ్రేక్ పడుతుంది.

తల్లి మందలించిందని తనయుడు ఆత్మహత్య

కంచరపాలెం, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): ట్యూషన్‌కు వెళ్లలేదేమని మందలించినందుకు బాధ పడిన ఓ విద్యార్థి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన బుధవారం కంచరపాలెం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. కంచరపాలెం మెట్టు పాత రామారావు ఆసుపత్రి సమీపంలోని కొత్త రెడ్డికంచరపాలెంలో దాసరి సత్యనారాయణ, జ్యోతి దంపతులు తమ ఇద్దరు పిల్లలతో నివాసం ఉంటున్నారు. సత్యనారాయణ ఎలక్ట్రికల్ పనులు చేస్తుంటే, జ్యోతి కుట్టుమిషన్‌పై పనిచేస్తూ కుటుంబానికి తోడ్పాటు అందిస్తుంది. వీరి కుమారుడు దాసరి ఎర్నిబాబు (14), కేంద్రీయ విద్యాలయం (104 ఏరియా)లో తొమ్మిదో తరగతి చదువుతున్నాడు. బుధవారం సెలవు కావడంతో ఉదయం తన స్నేహితునితో ఆడుకోవడానికి బయటకు వెళ్లి సాయంత్రం ఇంటికి వచ్చాడు. ఎర్నికుమార్‌ను తల్లి మందలించి ట్యూషన్‌కి వెళ్లకుండా ఎక్కడ తిరుగుతున్నావని ప్రశ్నించింది. దీంతో బాధ పడిన ఎర్నిబాబు ముఖం కడుక్కుంటానని చెప్పి బాత్రూంలోకి వెళ్లాడు. లోపలకు వెళ్లిన కుమారుడు ఎంతకీ బయటకు రాకపోవడంతో తల్లిఅరిచింది. చుట్టుపక్కల వారు వచ్చి బాత్రూం తలుపు తీసి చూడగా నైలాన్ తాడుతో బాత్‌రూం తలుపునకు ఉరేసుకుని ఎర్నిబాబు కనిపించడంతో హుటాహుటిన సమీపంలోని ఆసుపత్రికి తరలించారు. అప్పటికే ఎర్రిబాబు మరణించినట్టు డాక్టర్లు చెప్పడంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. సమాచారం తెలుసుకున్న కంచరపాలెం సీఐ రవికుమార్ తన సిబ్బందితో కలిసి వెంటనే అక్కడకు చేరుకుని ఆరాతీశారు. మృతదేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు.

దాసరి ఎర్నిబాబు చనిపోయాడనే విషయం చుట్టుపక్కల వారికి తెలియడంతో మిత్రులు, పరిచయస్తులు షాక్‌కు గురయ్యారు. చాలా మంచి కుర్రోడని, బాగా చదువుతాడని పలువురు చెబుతూ కన్నీటి పర్యంతమయ్యారు. బుధవారం సాయంత్రం వరకు కనపించిన ఎర్నిబాబు అకస్మాత్తుగా చనిపోయాడనే విషయం తెలిసి స్థానికులు కంటతడి పెట్టారు.

అప్పన్న సన్నిధిలో ఉన్నతాధికారి

సింహాచలం, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): వరాహలక్ష్మీనృసింహస్వామిని ఆదాయపన్ను శాఖ ప్రిన్సిపల్ కమిషనర్ బి.శ్రీనివాస్ బుధవారం దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ మర్యాదలతో పర్యవేక్షణాధికారి త్రిమూర్తులు ఆహ్వానం పలికారు. కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్న ఆయన గోత్రనామాలతో అంతరాలయంలో అర్చకులు పూజలు చేశారు. గోదాదేవి అమ్మవారి దర్శనం తరువాత ఆలయ పండితులు వేదాశీర్వచనాలీయగా, అధికారులు శాలువతో సత్కరించి శేషవస్త్రాలు, ప్రసాదాలు, జ్ఞాపికను అందజేశారు.


కప్పస్తంభం వద్ద ప్రిన్సిపల్ కమిషనర్‌శ్రీనివాస్

ఇంటర్ విద్యార్థిని అదృశ్యంపై ఫిర్యాదు

తగరపువలస, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి) తగరపువలస గొల్లవీధిలో కుటుంబంతో కలిసి ఉంటున్న ఇంటర్ విద్యార్థిని (21) మంగళవారం రాత్రి నుంచి కనిపించడం లేదని ఆమె తల్లి భీమిలి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ విద్యార్థిని రాత్రి ఏడు గంటల సమయంలో స్నేహితురాలి దగ్గరకు వెళ్తున్నట్లు ఇంటిలో చెప్పి తిరిగి రాలేదని ఫిర్యాదులో పేర్కొన్నారు. భీమిలి ఏఎస్ఐ శ్రీనివాసరావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి


భీమిలి పోలింగ్ కేంద్రానికి చేరుకున్న సిబ్బంది

భీమునిపట్నం/ఆనందపురం, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): భీమిలిలోని జీవీఎంసీ మహాత్మాగాంధీ అప్పర్ ప్రైమరీ పాఠశాలలో గురువారం ఎమ్మెల్సీ ఎన్నికలకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఇక్కడ పురుషులు 157, మహిళలు 104 మంది కలిపి 261 మంది ఓట్లు ఉన్నారు. ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకూ పోలింగ్ జరుగుతుందని తహసీల్దార్ పి.రామారావు తెలిపారు. పోలింగ్ సిబ్బంది బుధవారం మధ్యాహ్నం చేరుకున్నారు. కేంద్రంలో సీసీ కెమెరాలు, మైక్రో అబ్జర్వర్‌ను ఏర్పాటు చేశారు. విశాఖ నార్త్ ఏసీపీ అప్పలరాజు పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించారు. సీఐ సుధాకర్ ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. పోలింగ్ కేంద్రానికి 100 నుంచి 200 అడుగుల వరకూ ఫ్లెక్సీలు, హోర్డింగులు లేకుండా చూశారు. ఆనందపురం మండలానికి పోలింగ్ బూత్ నెంబరు 122 కేటాయించగా, 44 మంది ఓటు వేయవలసి ఉంది.

అప్పన్న నిత్యాన్న ప్రసాద పథకానికి రూ.3 లక్షల విరాళాలు


చెక్ అందజేస్తున్న లంక హనుమంతరావు


విజయనగరం పడాల రాజేశ్వరి


చోడవరం వాసి దొడ్డి నరసింహారావు

సింహాచలం, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): వరాహ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానంలో నిత్యాన్న ప్రసాద పథకానికి వేర్వేరు ప్రాంతాలకు చెందిన ముగ్గురు దాతలు మొత్తం రూ.3 లక్షలు విరాళం సమర్పించారు. పోతినమల్లయ్యపాలెంవాసి లంక హనుమంతరావు రూ.లక్ష, చోడవరం ప్రాంతానికి చెందిన దొడ్డి నరసింహారావు 1,01,116లను చెక్కుల రూపంలో ఇవ్వగా, విజయనగరం ప్రాంతానికి చెందిన పడాల రాజేశ్వరి రూ.1,00,121ల నగదును దేవస్థానం సిబ్బందికి అందజేశారు. దాతల కుటుంబ సభ్యులకు అంతరాలయ దర్శనం, వేదాశీర్వచనం, శేషవస్త్రాలు, ప్రసాదాలను అందజేశారు.

అప్పన్నకు ఏడాది పొడవునా పైపూతగా సమర్పించు చందనం కొనుగోలు నిమిత్తం సీతమ్మధార ప్రాంతానికి చెందిన ఎ.రఘురామ రాజు రూ.50 వేలు విరాళంగా సమర్పించారు. ఆలయ పర్యవేక్షకుడు త్రిమూర్తులకు చెక్ రూపంలో బుధవారం సమర్పించారు.



ఆర్‌కే బీచ్‌లో ఏర్పాటు చేసిన కోటి శివలింగం



హరోం హర!

భక్తిశ్రద్ధలతో శివరాత్రి పూజలు

- కిటకిటలాడిన ఆలయాలు
- ఆర్‌కే బీచ్‌లో కన్నుల పండువగా మహా కుంభాభిషేకం
- వేలాదిగా తరలివచ్చిన భక్త జనం

మహా శివరాత్రి సందర్భంగా బుధవారం జిల్లా వ్యాప్తంగా శైవక్షేత్రాలు భక్తులతో కిటకిటలాడాయి. తెల్లవారుజాము నుంచి ప్రత్యేక పూజలు, రుద్రాభిషేకాలు నిర్వహించారు. నగరంలోని ప్రధాన ఆలయాలతో పాటు గాజువాక సమీపంలోని అప్పికొండ ఆలయానికి పెద్దసంఖ్యలో భక్తులు తరలివచ్చారు. పలు ఆలయాల్లో మధ్యాహ్నం అన్నసమారాధన ఏర్పాటు చేశారు. మరోవైపు ఆర్‌కే బీచ్‌లో కేంద్ర మాజీ మంత్రి టి.సుబ్బరామిరెడ్డి ఆధ్వర్యంలో కోటి లింగాలకు మహా కుంభాభిషేకం కన్నుల పండువగా జరిగింది. వేలాదిగా తరలివచ్చిన భక్తులు స్వయంగా శివుడికి అభిషేకాలు చేశారు. ఈ నేపథ్యంలో తీరప్రాంతం కిక్కిరిసిపోయింది. బీచ్‌రోడ్డు సందర్శకులతో నిండిపోయింది.

- విశాఖపట్నం, ఆంధ్రజ్యోతి



ఎంవీపీ కాలనీ ముక్తేశ్వర స్వామి ఆలయంలో అభిషేకాలు చేస్తున్న భక్తులు



నక్కవానిపాలెం శివాలయంలో అభిషేకం చేస్తున్న దృశ్యం



కేఆర్ఎం కాలనీ శివాలయంలో ధ్వజస్తంభం వద్ద మహిళల పూజలు



ఎంవీపీ కాలనీ శివాలయంలో స్వామి దర్శనానికి బారులు తీరిన భక్తులు

చికిత్స పొందుతూ యువకుడి మృతి



సిద్దు (ఫైల్ ఫొటో)

మల్కాపురం, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): పార్కింగ్‌లో ఉన్న బైక్‌ను తీస్తూ అదుపుతప్పి గాయపడిన యువకుడు చికిత్స పొందుతూ మృతిచెందాడు. మల్కాపురం ప్రాంతానికి చెందిన సిద్దు (22) సోమవారం శ్రీహరిపురం వెళ్లి తన బైక్ పార్క్ చేశాడు. తిరిగి వెళ్లేందుకు బైక్ తీస్తుండగా అదుపుతప్పి దాని కింద పడిపోయాడు దీంతో తలకు బలమైన గాయమైంది. ఆస్పత్రికి తరలించగా వైద్యులు చికిత్స చేసి పంపారు. కొంత సేపటికే పరిస్థితి విషమించడంతో తిరిగి కేజీహెచ్‌కు తరలించగా, అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

లక్ష్య సాధనకు కృషిచేయాలి

పెందుర్తి, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు లక్ష్యం దిశగా కఠోర సాధనతో సాగిపోవాలని జడ్పీటీసీ మాజీ సభ్యుడు రెడ్డి నారాయణరావు పేర్కొన్నారు. రాంపురం ఉన్నత పాఠశాల పదోతరగతి విద్యార్థుల వీడ్కోలు సభ బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశలో పదోతరగతి కీలకమని, లక్ష్యం ఏర్పరచుకుని, ఆదిశగా సాధన చేయాలన్నారు. ప్రధానోపాధ్యాయుడు వరప్రసాద్, ఉపాధ్యాయులు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు వినతిపత్రం

సింధియా, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణలో భాగంగా రెల్లి సామాజికవర్గానికి ప్రాధాన్యం కల్పించేలా కృషి చేయాలని రెల్లి కుల అభివృద్ధి సంఘం అధ్యక్షుడు కొట్నాన రవి పశ్చిమ ఎమ్మెల్యే గణబాబును కోరారు. జీవీఎంసీ 63వ వార్డు రెల్లి సంఘం నేతలతో కలిసి బుధవారం ఎమ్మెల్యేకు వినతిపత్రం ఇచ్చారు.

సినిమా గైడ్

- **డ్రాగన్:** జగదాంబ, శ్రీకన్య, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), నటరాజ్-1 (పెందుర్తి), శ్రీకన్య (గాజువాక).
- **లైలా:** శ్రీ వెంకటేశ్వర-1, రమాదేవి, శ్రీరామా, గోకుల్, కిన్నెర, మోహిని (గాజువాక), మౌర్య (గోపాలపట్నం)
- **తండేల్:** సంగం, కామేశ్వరి, శ్రీవెంకటేశ్వర, శ్రీలీలామహల్, ఊర్వశి (కంచరపాలెం), నరసింహ (గోపాలపట్నం), అన్నపూర్ణ(కూర్మన్నపాలెం), అరుణ (పెదగంట్యాడ)
- **సంక్రాంతికి వస్తున్నాం:** శారద, మెలోడి, జగదాంబ, కాంతి, శ్రీలక్ష్మీనరసింహ-1,2 (104 ఏరియా), శ్రీనరసింహ (గోపాలపట్నం), లిఖిత (శ్రీహరిపురం), తాతా, రాములమ్మ (తగరపువలస)
- **డాకు మహారాజ్:** శరత్, కిన్నెర, మోహిని కాంప్లెక్స్, శ్రీకన్య హెవెన్ (గాజువాక), గణేష్, సప్తగిరి (తగరపువలస)
- **గేమ్ ఛేంజర్:** మెలోడి, సంగం, కామేశ్వరి, గోకుల్, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), కన్యకాంప్లెక్స్, మోహిని కాంప్లెక్స్ (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), సీతారామయ్య (పరవాడ), నటరాజ్-2 (పెందుర్తి) రాములమ్మ (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 33, టమాటా 14, వంకాయలు (తెలుపు) 20, వంకాయలు (నలుపు) 15, బెండకాయలు 42, పచ్చిమిర్చి 26, కాకరకాయలు 36, బీరకాయలు 60, ఆనపకాయ16, కాలీఫ్లవర్ 14, క్యాబేజి 12, క్యారెట్ 28 దొండకాయలు 32, బంగాళదుంపలు 14, అరటికాయ 6, మునక్కాడలు (కిలో) 62, అల్లం 52, బరబాటి 30, ముల్లంగి 20, నిమ్మకాయలు (కిలో) 65, బద్దచిక్కుడు 26, దోసకాయలు 24, వెల్లుల్లి 100, కొబ్బరికాయ 25, బీన్స్ 32, కీరదోస 26, కాప్సికమ్ 38, పొట్లకాయ 28, చేమదుంపలు 38 చిలగడదుంపలు 40, కంద 64, దేముడు చిక్కుడు 40, గోరుచిక్కుడు 36, కూరపెండలం 26, బ్రకోలి 55, నూల్‌కోల్ 30, పనసపొట్టు 200, కొండఉసిరి 70, కరివేపాకు (కిలో) 60, కొత్తిమీర (పెద్దకట్ట) 15, పుదీన (కట్ట) 4, చుక్కకూర (కట్ట) 4, పాలకూర (కట్ట) 4, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు80, బూడిదగుమ్మడికాయ 30, క్యారపెండలం 22, మామిడి అల్లం 46, బొప్పాయి 42, జామకాయలు (కిలో) 60.

కోడిగుడ్లు (నెక్)	
(వంద - రూ.లలో)	
విశాఖపట్నం	482
విజయనగరం	486
శ్రీకాకుళం	486

చికెన్ ధరలు	
బ్యాగ్	
రైతు ధర	71
లైవ్ ధర	91
విత్ స్కిన్	152
స్కిన్‌లెస్	162

ముక్కంటికి భక్త నీరాజనం

- మహా శివరాత్రి సందర్భంగా కిటకిటలాడిన శైవక్షేత్రాలు
- వేకువజాము నుంచే ఆలయాల వద్ద బారులుతీరిన భక్తులు



కణితిలో పూజలందుకున్న ఉమామార్కండేశ్వరుడు

కూర్మన్నపాలెం, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని నగరంలోని శైవక్షేత్రాలన్నీ భక్తులతో కిటకిటలాడాయి. వేకువజాము నుంచే శివాలయాల వద్ద భక్తులు బారులుతీరారు. హరహర మహాదేవ.. శంభో శంకర.., ఓం నమశ్శివాయ వంటి నామస్మరణలతో ఆలయాలు మార్మోగాయి. ఆయా ఆలయాల్లో ముక్కంటికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అర్చనలు, రుద్రాభిషేకాలు, హోమాలను అర్చకులు అత్యంత వైభవంగా నిర్వహించారు. ఇందులో భాగంగా 86వ వార్డు పరిధి మాతృశ్రీ నగర్‌లోని కాశీ అన్నపూర్ణాదేవి సమేత విశ్వేశ్వరాలయంలో ధర్మకర్త దామా సుబ్బారావు, దమయంతిల ఆధ్వర్యంలో పూజాది కార్యక్రమాలను చేపట్టారు. అధిక సంఖ్యలో విచ్చేసిన భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేశారు. అలాగే దువ్వాడ చినయాత పాలెం, సాయిరాం నగర్‌లో స్వయంభూ శివలింగం వద్ద, కణితి, కూర్మన్నపాలెం, దువ్వాడ, వుడా నగర్, రాజీవ్ నగర్, శాతవాహన నగర్ ప్రాంతాల్లోని శివాలయాలు భక్తులతో సందడిగా మారాయి. అదేవిధంగా 87వ వార్డు వడ్లపూడి సీతారామ లింగేశ్వరస్వామి ఆలయంలోని బ్రహ్మసూత్ర శివలింగం వద్ద ప్రత్యేక పూజలు, హోమాలు జరిపారు. పూజల్లో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బొండా జగన్, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు. కణితి కాళింగుల వీధిలో ఏర్పాటు చేసిన మంచు శివలింగం వద్ద, తెలుకల వీధిలో ఉమామర్కేండేశ్వరస్వామి ఆలయంలో పూజలు నిర్వహించారు. 86వ వార్డు రాజీవ్‌నగర్‌లోని పురాతన సోడ సోమన్న శివాలయంలో, సాయిరాంనగర్‌లో 18 అడుగుల ఏకశిల శివలింగం వద్ద, కూర్మన్నపాలెం సంపత్ వినాయక ఆలయంలో ప్రత్యేక పూజలు, హోమాలు జరిపారు. 71వ వార్డు శ్రీనగర్‌లోని ఉమారామ లింగేశ్వరస్వామి ఆలయంలో, 70వ వార్డు చట్టివానిపాలెం శివాలయంలో అమృత లింగేశ్వరునికి వెయ్యి లీటర్ల పాలతో క్షీరాభిషేకలు చేశారు. ఎర్రగెడ్డకాలనీ లక్ష్మీగణపతి ఆలయంలో, ఆటోనగర్ శివాలయంలో జరిగిన పూజల్లో భక్తులు పాల్గొన్నారు. పలు ఆలయాల వద్ద మధ్యాహ్నం చేపట్టిన అన్న సమారాధనలో అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

గాజువాక: గాజువాక సనత్‌నగర్‌లోని ఏకాంబరేశ్వరాలయం, వంటిల్లు శివాలయం, వినాయకనగర్ వుడాకాలనీ శివాలయం, పాతగాజువాక శివాలయాల్లో శివరాత్రిని పురస్కరించుకుని ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. ఉదయం నుంచి రాత్రి వరకు ఆయా ఆలయాలు భక్తులతో కళకళలాడాయి. ఆలయాల వద్ద జాగరణ చేసే వారి కోసం భక్తితో కూడిన సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేశారు.

పెదగంట్యాడ: పెదగంట్యాడ నిర్వాసిత కాలనీల్లోని ప్రధాన ఆలయాలైన దుర్గవానిపాలెం శివాలయం, బాలచెరువు కాలనీ ఉమారామలింగేశ్వరాలయం, సీతానగరంలోని శివరామకృష్ణ ఆలయం, ప్రియదర్శనీ కాలనీ కాశీవిశ్వేశ్వరాలయం, వికాస్‌నగర్‌లో పార్వతీపరమేశ్వరుల ఆలయం, సంజీవ కాలనీలోని చంద్రశేఖరాలయం, వెంకన్నపాలెం, గంగవరం, నడుపూరు, సిద్ధేశ్వరం శివాలయాలకు వేకువజాము నుంచే అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి పూజాది కార్యక్రమాల్లో పాల్గొన్నారు. రాత్రి వరకు ఆయా ఆలయాల వద్ద భక్తుల రద్దీ నెలకొంది. పలుచోట్ల సాయంత్రం శివపార్వతుల కల్యాణం జరిపారు.

అగనంపూడి: మహ శివరాత్రి పర్వదినాన పెదమడక ఉమామహేశ్వర ఆలయం, కర్రివానిపాలెంలో ఉమాసంతోషి ఆలయం, పాతఅగనంపూడి లింగాల తిరుగుడి, జాబిలిహిల్స్‌లో గల ఉమారామలింగేశ్వర స్వామి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. తెల్లవారుజాము నుంచే భక్తులు ఆలయాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆలయాల్లో పూజలు, రుద్రాభిషేకాలు, పంచామృతాభిషేకాలు జరిపారు. కాగా బ్రహ్మకుమారీస్ సంస్థ బీసీ కాలనీలో దివ్యజ్యోతి భవనంలో ఏర్పాటు చేసిన ద్వాదశ జ్యోతిర్లింగాలను దర్శించుకునేందుకు భక్తులు బారులు తీరారు.

అక్కిరెడ్డిపాలెం: షీలానగర్‌లోని శివశక్తి సాయిమందిరంలో శివలింగానికి పంచామృతాలతో అర్చకులు అభిషేకించాక ప్రత్యేక పుష్పాలతో అలంకరించి పూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. కాపుతుంగ్లాంలోని శివాలయంలో, నాతయ్యపాలెం కాశీవిశ్వేశ్వరాలయంలో, అక్కిరెడ్డిపాలెం సాయి సహిత శివమందిరంలో, మిందిలోని విశ్వేశ్వరాలయంలో జరిగిన పూజల్లో భక్తులు పాల్గొన్నారు.

గోపాలపట్నం: ఇక్కడి చంద్రమౌళీశ్వరాలయం, భీమేశ్వరాలయం, కొత్తపాలెం ఉమానాగలింగేశ్వరాలయం, ఎంఈఎస్ పంపుహౌస్ వద్ద పార్వతీ సహిత చంద్రశేఖరాలయం, యల్లపువానిపాలెం, పద్మనాభనగర్, ఆర్ఆర్ వెంకటాపురం శివాలయాల్లో పూజలు, రాత్రి రుద్రాభిషేకం చేశారు. నరవ ఉమానాగలింగేశ్వర ఆలయంలో భక్తులు అభిషేకాలు, పూజల్లో పాల్గొన్నారు.



పెదమడకలో శివలింగానికి ప్రత్యేక అలంకరణ

సింధియా: షిప్‌యార్డ్ కాలనీ ఉమామహేశ్వర ఆలయంలో ప్రత్యేక పూజలు, రుద్రాభిషేకాలు జరిగాయి. కార్పొరేటర్ గుండపు నాగేశ్వరరావు పాల్గొన్నారు.

మల్కాపురం: పారిశ్రామిక ప్రాంతంలోని రెడ్డివీధి, ప్రకాశనగర్, మాజీ సైనికుల కాలనీ, షిప్‌యార్డు కాలనీ, చింతమణి ఆలయాలు భక్తులతో కిక్కిరిశాయి.

పెందుర్తి: సరిపల్లి స్వయంభు శివాలయంలో క్షీరాభిషేకం చేశారు పినగాడి చోడేశ్వరస్వామి ఆలయంలో ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు పంచామృతాభిషేకాలు చేశారు. టీడీపీ నేత బయిలపూడి హరగోపాల్ కుటుంబసభ్యులు సమకూర్చిన రుద్రాక్షలను ఎమ్మెల్యే భక్తులకు పంపిణీ చేశారు. పెందుర్తి, రత్నగిరినగర్, సుజాతనగర్, శ్రమశక్తినగర్ ఆలయాల్లో పూజలు చేశారు.

వేపగుంట: కృష్ణానగర్ దుర్గామల్లేశ్వరాలయం, రవినగర్, ప్రహ్లాదపురం, వేపగుంట శివాలయాలు, ముత్యాలమ్మ ఆలయంలో పూజలు జరిగాయి. వేపగుంట వీరాంజనేయ పరస నిర్వహించారు. అన్నసంతర్పణను పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు, పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్ బాబు, మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద్, టీడీపీ ఇన్‌చార్జి గండి బాబ్జీ ప్రారంభించారు.

ఎన్ఏడీ జంక్షన్: స్థానిక ఉమా విశ్వేశ్వరాలయంలో విగ్రహ ప్రతిష్ఠ జరిగింది. పూజలు, అభిషేకాలు చేశారు. బుచ్చిరాజుపాలెం చంద్రమౌళీశ్వరాలయం, కాకానీనగర్, లక్ష్మీనగర్ ఉమాగణపతి ఆలయంలో వేడుకలు జరిగాయి.



భక్తజనంతో నిండిన నరవ శివాలయం



దుర్గవానిపాలెం శివాలయంలో పూజల్లో పాల్గొన్న భక్తులు



వేపగుంటలో అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే గణబాబు



పినగాడిలో రుద్రాక్షలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు

అప్పికొండ సోమేశ్వరుని దర్శనానికి పోటెత్తిన భక్తులు

- జాగరణ భక్తులతో సందడి వాతావరణం
- ఆలయం, సాగర తీరంలో పోలీసు భద్రత



అప్పికొండ సోమేశ్వరుడిని దర్శించుకునేందుకు క్యూలైన్లలో బారులుతీరిన భక్తులు

గాజువాక, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని అతి పురాతనమైన అప్పికొండ సోమేశ్వరుడిని దర్శించేందుకు భక్తులు పోటెత్తారు. బుధవారం వేకువజాము నుంచే స్వామి వారిని దర్శించడానికి భక్తులు బారులుతీరారు. కాగా ఈ ఏడాది భక్తుల కోసం ప్రత్యేకంగా గర్భాలయ దర్శనం పేరిట రూ.500 టిక్కెట్లను ప్రవేశపెట్టడంతో అధిక శాతం మంది వీటిని కొనుగోలు చేశారు. దీంతో రూ.500 టికెట్ల క్యూ లైన్‌లో భక్తుల తాకిడి అధికంగా కనిపించింది. ఇతర క్యూలైన్లలోనూ వేలాది మంది భక్తులు బారులు తీరారు. ఎటువంటి తోపులాటలు చోటుచేసుకోకుండా పోలీసులు దగ్గరుండి భక్తులను ఆలయంలోకి పంపించారు. భక్తుల దాహార్తిని తీర్చేందుకు ఆలయ పరిసరాల్లో అడుగడుగునా జీవీఎంసీ అధికారులు ఉచిత తాగునీటి కౌంటర్లను ఏర్పాటు చేశారు.

కాగా ముక్కంటి దర్శనానికొచ్చిన భక్తుల్లో అధికశాతం మంది సముద్ర స్నానాలకు దిగడంతో తీరం పొడవునా పటిష్ఠ పోలీస్ భద్రతను ఏర్పాటు చేశారు. సముద్రం లోపలకు భక్తులు వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. స్నానాలు ఆచరించాక మహిళలు దుస్తులు మార్చుకునేందుకు గాను నాలుగు ప్రత్యేక షెల్టర్లు ఏర్పాటు చేశారు. గాజువాక పారిశ్రామిక ప్రాంతంతో పాటు విశాఖ, అనకాపల్లి జిల్లాల నుంచి వేలాది మంది భక్తులు తరలివచ్చి రాత్రంతా జాగరణ చేసి తెల్లవారుజామున సముద్ర స్నానమాచరించి స్వామివారిని దర్శించుకోవడం ఆనవాయితీ. భక్తుల సౌకర్యార్థం ఆర్టీసీ అధికారులు ప్రత్యేక బస్సులు నడిపారు.

సోమేశ్వరుడిని దర్శించుకున్న ప్రముఖులు

అప్పికొండ సోమేశ్వరుడిని పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. 13వ అదనపు జిల్లా న్యాయమూర్తి షణ్ముఖరావు, ఎమ్మెల్యేలు పల్లా శ్రీనివాసరావు, బండారు సత్యనారాయణమూర్తి, పంచకర్ల రమేష్‌బాబు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు

ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్

అప్పికొండ ఆలయం వద్ద, తీరంలోని ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్ పరిశీలించారు. పోలీస్, జీవీఎంసీ, దేవస్థానం అధికారులతో ఏర్పాట్ల గురించి అడిగి తెలుసుకున్నారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. కాగా స్వామివారిని దర్శించుకోవాలని కలెక్టర్‌ను పలువురు అధికారులు కోరగా, భక్తుల రద్దీ అధికంగా ఉన్నందున తాను తరువాత దర్శించుకుంటానని బదులిచ్చారు.



మాట్లాడుతున్న కేంద్ర మాజీ మంత్రి సుబ్బరామిరెడ్డి, వేదికపై ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, సినీ నటుడు బ్రహ్మానందం తదితరులు

నాగఫణిశర్మకు అవధాన బ్రహ్మ బిరుదు ప్రదానం

బీచ్‌రోడ్, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ అవధాని మాడుగుల నాగఫణి శర్మకు టి.సుబ్బరామిరెడ్డి ఫౌండేషన్ బుధవారం అవధాన బ్రహ్మ బిరుదు ప్రదానం చేసింది. మహాశివరాత్రి సందర్భంగా ఆర్కేబీచ్‌లో కోటి లింగాలకు మహాకుంభాభిషేకం నిర్వహించిన అనంతరం నాగఫణిశర్మకు బిరుదుతో పాటు రూ.5 లక్షల నగదు బహుమతిని కేంద్ర మాజీ మంత్రి టి.సుబ్బిరామిరెడ్డిచ సినీ నటుడు బ్రహ్మానందం, భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అందజేసి సత్కరించారు. ఈ సందర్భంగా బ్రహ్మానందం మాట్లాడుతూ విశాఖ తీరంలో ఏటా మహాశివరాత్రి పర్వదినాన కోటి లింగాలు ఏర్పాటుచేసి మహాకుంభాభిషేకం నిర్వహించడం చాలా గొప్ప విషయమన్నారు. గత 40 ఏళ్లుగా ఈ కార్యక్రమం భక్తిభావాన్ని పెంపొందిస్తోందన్నారు.

అలరించిన నిమగ్న నృత్య రూపకం



నిమగ్న నృత్య రూపకం ప్రదర్శిస్తున్న రమా వైద్యనాథన్ బృందం

బీచ్ రోడ్డు, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రి సందర్భంగా ఆర్కేబీచ్ విశ్వప్రియ ఫంక్షన్ హాలు ఎదురుగా రమా వైద్యనాథన్ బృందం ప్రదర్శించిన నిమగ్న నృత్యరూపం అలరించింది. భారతీయ సంప్రదాయ నృత్య వైభవాన్ని ప్రతిబింబిస్తూ భక్తి, తత్వశాస్త్రం, జీవిత సత్యాలను కలగలిపిన ప్రదర్శన మంత్రముగ్ధుల్ని చేసింది. ఈ సందర్భంగా రమావైద్యనాథన్ మాట్లాడుతూ నాట్యం అంటే పరిపూర్ణ సమర్పణ అన్నారు. ఈ ప్రదర్శన ద్వారా ప్రేక్షకులకు వినూత్న అనుభూతికి గురిచేయడమే లక్ష్యమన్నారు. పరంపర ఫౌండేషన్‌ద్వారా మరిన్ని ప్రదర్శనలు ఏర్పాటు చేస్తామని నిర్వాహకులు ప్రకటించారు. కార్యక్రమంలో ఎంపీ ఎం.శ్రీభరత్, సీపీ డా.శంఖబ్రతబాగ్చి, టీడీపీ జిల్లా అధ్యక్షుడు గండి బాబ్జీ, ఎన్టీఆర్ వైద్యసేవా ట్రస్టు వైస్‌చైర్మన్ సీతంరాజు సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికకు ఏర్పాట్లు పూర్తి



గోపాలపట్నం ఓటింగ్ కేంద్రంలో ఏసీపీ

గాజువాక, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికకు సంబంధించి గాజువాక నియోజకవర్గంలో పోలింగ్ కేంద్రాలను సిద్ధం చేశారు. నియోజకవర్గంలో గాజువాక హైస్కూల్, నడుపూరు హైస్కూల్‌లో పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. గాజువాకలో 708 మంది, నడుపూరులో 101 మంది ఉపాధ్యాయులు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. ఆయా కేంద్రాలకు బుధవారం మధ్యాహ్నమే పోలింగ్ సిబ్బంది చేరుకున్నారు. సౌత్ ఏసీపీ టి.త్రినాథ్ గాజువాక కేంద్రాన్ని పరిశీలించారు.

పెందుర్తి: ఎమ్మెల్సీ ఎన్నికలకు స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటుచేశారు నియోజకవర్గంలో 954 మంది ఓటర్లున్నారని తహసీల్దార్ ఆనంద్‌కుమార్ తెలిపారు. ఓటరు స్లిప్పులను పంపిణీ చేశామని, పోలింగ్ కేంద్రం 144 సెక్షన్ అమలులో ఉందన్నారు. తహసీల్దార్ ఆనంద్‌కుమార్, సీఐ కెవీ సతీశ్‌కుమార్ పోలింగ్ కేందాన్ని పరిశీలించారు.

గోపాలపట్నం: ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో గోపాలపట్నం జెడ్పీ హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన పోలింగ్ బూత్‌ను బుధవారం ఏసీపీ పృథ్వీతేజ పరిశీలించారు. పోలింగ్ సజావుగా జరిగేలా చర్యలు చేపట్టాలని సిబ్బందిని ఆదేశించారు.

వినూత్న కార్యక్రమాలకు వేదిక స్టీల్‌క్లబ్



కార్యక్రమం ప్రారంభిస్తున్న ప్లాంట్ జీఎంలు

ఉక్కుటౌన్‌షిప్, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): వినూత్న కార్యక్రమాలకు వేదికగా స్టీల్ క్లబ్ నిలుస్తుందని క్లబ్ అధ్యక్షుడు మధుసూదన్, కార్యదర్శి రామకృష్ణ అన్నారు. క్లబ్‌లో బుధవారం నిర్వహించిన సాంస్కృతిక సంబరాలను వారు ప్రారంభించారు. జీఎంలు చిట్టిబాబు, ఘోష్, కార్యవర్గ ప్రతినిధులు పాల్గొన్నారు.

'సభ్యుల సంక్షేమమే ఓబీసీ అసోసియేషన్ ధ్యేయం'

ఉక్కుటౌన్‌షిప్, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): స్టీల్‌ప్లాంట్ ఓబీసీ ఉద్యోగుల సంక్షేమమే లక్ష్యంగాసాగుతున్నామని అసోసియేషన్ అధ్యక్షుడు బి.అప్పారావు అన్నారు. స్టీల్‌క్లబ్‌లో మంగళవారం జరిగిన నాల్గో సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతూ విశ్రాంత ఉద్యోగులకు 75గ్రాముల సిల్వర్ కాయిన్, మృతిచెందిన ఉద్యోగి కుటుంబానికి 75వేలు ఇస్తున్నామన్నారు. కార్యదర్శి ఎస్.శ్రీనివాసరావు, కోశాధికారి యు.శ్రీనివాస్, వైఎల్.నాయుడు, బి.శశిభూషణరావు, నాయుడు, ప్రసాద్, సింహాచలం, మోహిద్దిన్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఆంజనేయస్వామి పరస

అగనంపూడి, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): గొన్నవానిపాలెం ఆంజనేయ స్వామి ఆలయం వద్ద బుధవారం పరస నిర్వహించారు. భక్తులు పెద్దసంఖ్యలో స్వామిని దర్శించుకున్నారు. సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. బొర్రమాంబ యూత్ ప్రతినిధులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

గంజాయి పట్టివేత.. ఇద్దరి అరెస్టు

విశాఖపట్నం, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): రైల్లో గంజాయి రవాణా చేస్తున్న వ్యక్తులను పట్టుకుని వారి నుంచి గంజాయి సంచులను స్వాధీనం చేసుకున్నట్లు రైల్వే పోలీసులు తెలిపారు. బుధవారం జీఆర్పీ ఎస్ఐ అబ్దుల్ మారూఫ్, ఆర్పీఎఫ్ ఏఎస్ఐ జె.టి.నాయుడు తమ బృందాలతో తనిఖీలు నిర్వహిస్తున్న సమయంలో కేరళకు చెందిన అనిల్ రాజ్ అనే నిందితుడ్ని పట్టుకుని అతని వద్ద నుంచి 17.5 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. అలాగే జీఆర్పీ ఎస్ఐ కె.శాంతారామ్, ఆర్పీఎఫ్ ఏఎస్ఐ శివనారాయణ వారి సిబ్బందితో తనిఖీలు చేస్తున్న సమయంలో ఉత్తర ప్రదేశ్‌కు చెందిన మీర్ హుస్సేన్ అనే నిందితుని పట్టుకుని అతని వద్ద నుంచి 8 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. వీరిద్దరిపై కేసులు నమోదు చేసి కోర్టుకు తరలించామని రైల్వే పోలీసులు పేర్కొన్నారు.

ఎన్ఎస్‌టీఎల్ సెక్షన్‌లో రేపు విద్యుత్ సరఫరా నిలిపివేత

మురళీనగర్, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): ఏపీ ఈపీడీసీఎల్ ఆపరేషన్ డివిజన్ జోన్-2లోని ఎన్ఎస్‌టీఎల్ సెక్షన్‌లో అన్ని 11 కె.వి.ఫీడర్‌లు నిర్వహణ పనుల నిమిత్తం ఈ నెల 28న విద్యుత్ సరఫరాకు ఆటంకం ఏర్పడనుందని డీఇఇ బి.కె.నాయుడు తెలిపారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సరఫరా నిలిపివేసి పనులు చేపట్టనున్నారు. ఈ కారణంగా మాధవధార, మర్రిపాలెం ప్రాంతాలకు సరఫరా ఉండదన్నారు. మర్రిపాలెం పంజాబ్‌హోటల్ జంక్షన్, జర్నలిస్ట్ కాలనీ, పార్వతీనగర్, హుస్సేన్ నగర్, మాధవధార కళింగనగర్, వంశీనగర్, రాజీవ్‌నగర్ ప్రాంతాలకు సరఫరాను తాత్కాలికంగా నిలిపివేసి పనులు చేపట్టనున్నందున వినియోగదారులు సహకరించాలని కోరారు.







శివనామస్మరణతో మార్మోగిన ఆలయాలు


సీతంపేట పార్వతీశ్వరాలయంలో అభిషేక పూజల్లో పాల్గొన్న భక్తులు


నక్కవానిపాలెం ఉమానీలకంఠేశ్వరాలయంలో భక్తుల కైమోడ్పులు

డాబాగార్డెన్స్/జ్ఞానాపురం/మాధవధార/అక్కయ్యపాలెం/సీతమ్మధార/కంచరపాలెం, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రి సందర్భంగా బుధవారం దక్షిణ, ఉత్తర నియోజకవర్గాల్లోని పలు శైవాలయాలు భక్తుల శివనామస్మరణతో మారుమోగాయి.ఆలయాలను విద్యుత్ దీపాలతో అలంకరించారు. మామిడి తోరణాలతో ముస్తాబు చేశారు. వేద మంత్రాలతో రుద్రాభిషేకాలు నిర్వహించారు. వేకువ జాము నుంచి భక్తులు దర్శనానికి క్యూ కట్టారు. శివునికి అర్చకులు సంప్రదాయబద్ధంగా పూజలు చేశారు. అర్చనలు, అభిషేకాలు పెద్దఎత్తున జరిగాయి. జగదాంబ కూడలిలోని విశ్వేశ్వరస్వామికి విశేష అర్చనలు జరిగాయి. రావిచెట్టు వద్ద మహిళలు దీపాలు వెలిగించారు. జ్ఞానాపురం, అల్లిపురం ప్రాంతాల్లో పెద్ద ఎత్తున భక్తులు బారులు తీరి రుద్రాభిషేకాలు, విభూది, పంచామృతాభిషేకాలు జరిపించారు. మాధవధారలోని భ్రమరాంబికా మల్లికార్జునస్వామి దేవస్థానంలో పెద్దసంఖ్యలో భక్తులు మహాశివుని దర్శించుకున్నారు. మాధవధార గాంధీనగర్ అమృతలింగేశ్వర స్వామి సన్నిధిలోని స్ఫటిక లింగానికి భక్తులు జలాభిషేకం చేశాక వారిని స్పర్శ దర్శనానికి అనుమతించారు. కార్పొరేటర్ ఆర్.వెంకటరమణ దంపతులు స్వామికి అభిషేకం చేశారు. పాలిటెక్నిక్ కాలేజీ దగ్గర కాశీవిశ్వేశ్వరస్వామి, బర్మా క్యాంప్ శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. రాత్రి లింగోద్భవ కాలంలో విశేష పూజల్లో


నక్కవానిపాలెంలో నీలకంఠునికి జలాభిషేకం

భస్మాభిషేకం, రుద్రాభిషేకాలు జరిపారు. గ్రేటర్ 26వ వార్డు రామకృష్ణానగర్‌లో కార్పొరేటర్ ముక్కా శ్రావణి తదితరులు అభిషేకాలు చేశారు. జగ్గారావు బ్రిడ్జి వద్ద గౌరీపరమేశ్వరాలయం, రైల్వేన్యూకాలనీ, కైలాసపురం ఆలయాల్లో భక్తులకు అసౌకర్యం కలగకుండా అధికారులు ఏర్పాట్లు చేశారు. దొండపర్తిలో ఎరుకుమాంబ అమ్మవారికి కార్పొరేటర్ గొలగాని వీరారావు తదితరులు అభిషేకాలు చేశారు. కంచరపాలెం, తిక్కవానిపాలెం, గంగన్న నగర్, రెడ్డికంచరపాలెం, ధర్మానగర్, దేవేంద్రనగర్, గొల్ల కంచరపాలెం, తుమ్మడిపాలెం తదితర ప్రాంతాల్లో పంచామృతాభిషేకాలు జరిగాయి. తిక్కవానిపాలెంలోని కాశీ అన్నపూర్ణేశ్వర ఆలయంలో కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు వాసుదేవరావు, పి.రాజు ఆధ్వర్యంలో చేపట్టిన ప్రత్యేక రుద్రాభిషేకంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. నక్కవానిపాలెంలోని ఉమానీలకంఠేశ్వర స్వామి ఆలయానికి అధిక సంఖ్యలో భక్తులు విచ్చేసి శివనామస్మరణ చేశారు. అర్చకులు రామారావు శర్మ, ఉర్జి మహేష్ శర్మలు శివలింగానికి పంచామృతాలు, విభూదితో అభిషేకం చేశారు. అమ్మవారికి కుంకుమార్చన అనంతరం తీర్థప్రసాద వితరణ చేశారు. లింగోద్భవకాలంలో అభిషేకాలు చేశారు. సీతంపేట పార్వతీశ్వరాలయంలో దేవదాయ, ధర్మదాయ శాఖ ఆధ్వర్యంలో మహాశివ లింగానికి పాలు, పంచామృతాలు, పండ్ల రసాలతో విశేష అభిషేకాలు నిర్వహించారు. అర్చకులు శివాజి శర్మ, భాస్కర శర్మలు అర్చన చేశాక భక్తులకు దర్శనం కల్పించారు.


విశ్వేశ్వరస్వామి ఆలయంలో భక్తులు

శివతాండవంపై ఆకట్టుకున్న ప్రసంగం

సీతంపేట, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): విద్యావేత్త పుట్టపర్తి నారాయణాచార్యులు రచించిన శివతాండవం కావ్యంపై తిరుమల బ్రహ్మోత్సవాల వ్యాఖ్యాత రాంభట్ల నృసింహ శర్మ ఇచ్చిన ప్రసంగం ఆహూతులను ఆకట్టుకుంది. మహాశివరాత్రి సందర్భంగా ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో సహృదయ సాహితి సంస్థ నిర్వహణలో అధ్యక్షుడు శేఖరమంత్రి ప్రభాకర్, డాక్టర్ కె.జి. వేణుల ఆధ్వర్యంలో బుధవారం రాత్రి ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రాంభట్ల


ఆధ్యాత్మిక ప్రసంగం చేస్తున్న రాంభట్ల

శివతాండవ నాట్య ప్రభావాన్ని వర్ణించిన తీరు సభాసదులను ఆకట్టుకుంది. డాక్టర్ డి.వి.సూర్యారావు, దర్భముళ్ళ చంద్రశేఖర్, భాగవతుల సత్యనారాయణమూర్తి, చిన సూర్యనారాయణ పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికకు సర్వం సిద్ధం

కంచరపాలెం, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నిక గురువారం జరగనున్న నేపథ్యంలో కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల్లో అధికారులు పోలింగ్ స్టేషన్‌ను ఏర్పాటు చేశారు. కళాశాల్లో స్కిల్ డెవలప్‌మెంట్ విభాగం వద్ద పోలింగ్ నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు పూర్తిచేశారు. కంచరపాలెం ఎస్ఏడీ, మర్రిపాలెం, మాధవధార, ఆర్పీపేట, తాటిచెట్లపాలెం, మురళీనగర్ తదితర ప్రాంతాల్లోని ఉపాధ్యాయులంతా ఇక్కడ తమ ఓటుహక్కు వినియోగించుకోనున్నారు.

వైభవంగా దుర్గాలమ్మ జాతర మహోత్సవం

జగదాంబ కూడలి, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): పూర్ణామార్కెట్‌లో దుర్గాలమ్మ మహోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. తెల్లవారుజాము 5 గంటల నుంచి భక్తులు దర్శనానికి తరలిరావడంతో క్యూలైన్లు రద్దీగా కనిపించాయి. జాతర సందర్భంగా పండావీధి, కల్లుపాకలు ఏరియాల్లో అగ్నిగుండం కార్యక్రమంలో భక్తులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. అమ్మవారి భక్తులు శూలాలు వేసుకొని మొక్కులు చెల్లించుకున్నారు. అగ్నిగుండాలు తొక్కారు. వీధి వీధినా అమ్మవారి రూపాలతో ఘటాలను భక్తులు మోశారు. అమ్మవారి ఆలయంలో కుంకుమార్చనలు, అభిషేక పూజలు జరిగాయి. అమ్మవారి మూలవిరాట్‌ను సుందరంగా అలంకరించారు. వన్‌టౌన్ సీఐ దేముడు బాబు ఘటాన్ని తలకెత్తుకొని ఆలయంలో పూజలు జరిపారు. ఈవో శేఖర్ బాబు ఏర్పాట్లను పర్యవేక్షించారు.


ఘటాన్ని మోస్తున్న వన్‌టౌన్ సీఐ దేముడు బాబు, పక్కన ఈవో శేఖర్ బాబు తదితరులు

వేర్వేరు ప్రాంతాల్లో ఇద్దరు అదృశ్యం

కంచరపాలెం, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): కంచరపాలెం పోలీస్ స్టేషన్ పరిధిలోని రెండు వేర్వేరు ప్రాంతాల్లో ఇద్దరు అదృశ్యమయ్యారు. బుధవారం పోలీసులు తెలిపిన సమాచారం ప్రకారం.. జ్ఞానాపురం రైల్వే స్టేషన్‌లో పారిశుధ్య పనుల్లో చేరిన మర్రి బందో (43) ఈ నెల 14న విధుల్లో చేరిన బందో 17 నుంచి కనిపించకపోవడంతో ఆమె భర్త కామేశ్వరరావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. అదే విధంగా జ్ఞానాపురం నికోలస్ వీధిలో నివాసం ఉంటున్న కండిపిల్లి దుర్గాప్రసాద్ (31) ఈ నెల 3న భార్యతో గొడవపడ్డాడు. దీంతో ఆమె కన్నవారింటికి వెళ్లిపోయింది. ఈ నెల 15న ఇసుకతోటలో ఉంటున్న తల్లికి దుర్గాప్రసాద్ ఫోన్ చేసి క్యాటరింగ్ పనులకు వెళ్తున్నానని చెప్పి తిరిగిరాలేదు. అతని భార్య రాణి ఫిర్యాదు మేరకు కంచరపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. రెండు కేసులను హెడ్ కానిస్టేబుళ్లు బి.శివ సాగర్, అబద్ధం దర్యాప్తు చేస్తున్నారు.

ఆధ్యాత్మిక చింతన అవసరం: మేయర్


కేకు కోస్తున్న మేయర్ హరి వెంకట కుమారి, చిత్రంలో బ్రహ్మకుమారీలు

అక్కయ్యపాలెం, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ 42వ వార్డు రైల్వేన్యూకాలనీలోని బ్రహ్మకుమారీల ఆధ్యాత్మిక సంస్థలో శివరాత్రి వేడుకలు బుధవారం ఘనంగా జరిగాయి. ఈ వేడుకలకు ముఖ్యఅతిథిగా నగర మేయర్ గొలగాని హరి వెంకట కుమారి హాజరై కేకు కోశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆధ్యాత్మిక చింతన, ఆత్మీయ విలువలు, ధ్యానం ప్రతి ఒక్కరి జీవితంలో అవసరమన్నారు. ఈ కార్యక్రమంలో బ్రహ్మకుమారీల బ్రాంచ్ ఇన్‌చార్జ్ శశికళ, విశాఖ కంటైనర్ టెర్మినల్ జీఎం హెచ్ఆర్ జితాజీ తదితరులు పాల్గొన్నారు.

గురువు దైవంతో సమానం : ఎంవీ

డాబాగార్డెన్స్, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): గురువు దైవంతో సమానమని ఆధ్యాత్మికవేత్త ఎం.వి.రాజశేఖర్ పేర్కొన్నారు. బుధవారం ఆర్టీసీ కాంప్లెక్స్ రోడ్డు సత్యానంద విశ్వవిహార్‌లో మహాశివరాత్రి ఉత్సవాన్ని, భగవాన్ సత్యానంద మహర్షి 113వ జయంతిని నిర్వహించారు. పరమేశ్వరునికి అభిషేకాలు, మహామృత్యుంజయ హోమం, భగవన్నామ సంకీర్తనలు, పాదుకా పూజలను సంప్రదాయ పద్ధతిలో నిర్వహించారు. ఆధ్యాత్మికవేత్త ఎం.వి.రాజశేఖర్ 'గురు వందనం' అనే అంశంపై ప్రసంగించారు. గురువును ఆశ్రయించడం ద్వారా ఆధ్యాత్మిక జ్ఞానం


ఆధ్యాత్మిక ప్రసంగం చేస్తున్న ఎం.వి.రాజశేఖర్

కలుగుతుందన్నారు.పరమాత్ముని పరిపూర్ణమైన తత్వాన్ని తెలపగలిగే శక్తి గురువుకు మాత్రమే ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సత్యానంద విశ్వవిహార్ నిర్వాహకులు మాతాజీ సునంద, బ్రహ్మచారి శ్రీనివాస్ పాల్గొన్నారు.

తల్లి మందలించిందని తనయుడు ఆత్మహత్య

కంచరపాలెం, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): ట్యూషన్‌కు వెళ్లలేదేమని తల్లి మందలించిందన్న బాధతో ఓ విద్యార్థి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన బుధవారం కంచరపాలెం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. కంచరపాలెం మెట్టు పాత రామారావు ఆసుపత్రి సమీపంలోని కొత్త రెడ్డికంచరపాలెంలో దాసరి సత్యనారాయణ, జ్యోతి దంపతులు తమ ఇద్దరు పిల్లలతో నివాసం ఉంటున్నారు. సత్యనారాయణ ఎలక్ట్రికల్ పనులు చేస్తుంటే, జ్యోతి కుట్టుమిషన్‌పై పనిచేస్తూ కుటుంబానికి తోడ్పాటు అందిస్తుంది. వీరి కుమారుడు దాసరి ఎర్నిబాబు (14), కేంద్రీయ విద్యాలయం (104 ఏరియా)లో తొమ్మిదో తరగతి చదువుతున్నాడు. బుధవారం సెలవు కావడంతో ఉదయం తన స్నేహితునితో ఆడుకోవడానికి బయటకు వెళ్లి సాయంత్రం ఇంటికి వచ్చాడు. ఎర్నికుమార్‌ను తల్లి మందలించి ట్యూషన్‌కి వెళ్లకుండా ఎక్కడ తిరుగుతున్నావని ప్రశ్నించింది.


ఎర్నిబాబు మృతదేహం

దీంతో బాధపడిన ఎర్నిబాబు ముఖం కడుక్కుంటానని చెప్పి బాత్రూంలోకి వెళ్లాడు. లోపలకు వెళ్లిన కుమారుడు ఎంతకీ బయటకు రాకపోవడంతో తల్లి అరిచింది. చుట్టుపక్కల వారు వచ్చి బాత్రూం తలుపు తీసి చూడగా నైలాన్ తాడుతో బాత్‌రూం తలుపునకు ఉరేసుకుని ఎర్నిబాబు కనిపించడంతో హుటాహుటిన సమీపంలోని ఆసుపత్రికి తరలించారు. అప్పటికే ఎర్రిబాబు మరణించినట్టు డాక్టర్లు చెప్పడంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. సమాచారం తెలుసుకున్న కంచరపాలెం సీఐ రవికుమార్ తన సిబ్బందితో కలిసి వెంటనే అక్కడకు చేరుకుని ఆరాతీశారు. మృతదేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. ఎర్నిబాబు మృతివిషయం చుట్టుపక్కల వారికి తెలియడంతో షాక్‌కు గురయ్యారు. మంచి కుర్రోడని, బాగా చదువుతాడని అంటూ కన్నీటిపర్యంతమయ్యారు.

యూటీఎస్ టికెట్ బుకింగ్‌పై అవగాహన

విశాఖపట్నం, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): మొబైల్ టికెట్ బుకింగ్‌పై ప్రయాణికులకు అవగాహన కల్పించేందుకు వాల్తేరు రైల్వే ప్రత్యేక డ్రైవ్ నిర్వహించే కార్యక్రమాలు చేపట్టింది. దీనిలో భాగంగా యూటీఎస్ మొబైల్ యాప్ వాడకాన్ని ప్రోత్సహిస్తూ ఆర్-వాలెట్ ద్వారా జరిగే టికెట్ బుకింగ్ లావాదేవీలపై ఆగస్టు నెలాఖరు వరకు మూడు శాతం క్యాష్ బ్యాక్‌ను అందిస్తోంది. డిజిటల్ చెల్లింపుల ద్వారా కాగిత రహిత టికెటింగ్‌ను పూర్తి స్థాయిలో ప్రయాణికులకు అందించే సదుపాయంలో భాగంగా యూటీఎస్ యాప్‌ను వాల్తేరు డివిజన్‌లో 2016లో ప్రారంభించామని సీనియర్ డీసీఎం కె.సందీప్ పేర్కొన్నారు. యూటీఎస్ యాప్‌పై ప్రయాణికులలో అవగాహన కల్పించేందుకు స్టేషన్లలో, ప్లాట్‌ఫామ్‌లపై వివిధ మాధ్యమాల ద్వారా యాప్‌ను వినియోగించే విధానాన్ని ప్రచారం చేస్తున్నామన్నారు. యూటీఎస్ యాప్‌ను ఎలా డౌన్‌లోడ్ చేసుకోవాలి, ఎలా వినియోగించాలి? అనే అంశాలకు


ప్రయాణికులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

సంబంధించి ప్రయాణికులకు అవగాహన కల్పించేందుకు ప్రత్యేకంగా హెల్ప్‌డెస్క్‌లు ఏర్పాటు చేశామన్నారు. ఈ యాప్‌ను యాక్సెస్ చేయడానికి క్యూఆర్ కోడ్‌లు అందుబాటులో ఉంచామన్నారు. క్యూఆర్ కోడ్ వలన డిజిటల్ చెల్లింపులు వేగంగా జరుగుతాయన్నారు. ఈ యాప్ ద్వారా చెల్లింపుల వలన రైల్వే కౌంటర్ల వద్ద టికెట్ కోసం ఎక్కువసేపు వేచి ఉండాల్సిన అవసరం ఉండదు.. చెల్లింపులో చిల్లర సమస్య తలెత్తదు.. ఎక్కడి నుంచి ఎక్కడికైనా మొబైల్ ద్వారా సులభంగా టికెట్ పొందవచ్చునని పేర్కొన్నారు.

నేడే ఎమ్మెల్సీ ఎన్నిక

... 5వ పేజీ తరువాయి

ఆరు జిల్లాల పరిధిలో 123 కేంద్రాలు ఏర్పాటుచేశారు. ఎన్నికల నిర్వహణకు 739 మంది అధికారులను నియమించారు. వీరిలో 148 మంది పీవోలు, 148 మంది ఏపీవోలు, 295 మంది ఓపీవోలు ఉన్నారు. మరో 148 మంది మైక్రో అబ్జర్వర్లను నియమించారు. ఎన్నికల సిబ్బంది, మెటీరియల్‌ను బుధవారం సాయంత్రానికే కేంద్రాలకు తరలించారు. ఎన్నిక బ్యాలెట్ విధానంలో నిర్వహిస్తున్నారు. పోలింగ్ నేపథ్యంలో కేంద్రాల వద్ద పోలీస్ బందోబస్తు ఏర్పాటుచేశారు.

జిల్లాలో 13 పోలింగ్ కేంద్రాలు

విశాఖ జిల్లాలో 13 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటుచేశారు. నడుపూరు జడ్పీ ఉన్నత పాఠశాలలోని ఈ-బ్లాక్, గాజువాక జడ్పీ ఉన్నత పాఠశాలలోని ఆరో తరగతికి చెందిన అదనపు భవనం, పెందుర్తి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో రూమ్ నంబర్-10, చినవాల్తేరులోని ఏయూ ప్రాథమిక పాఠశాల, డాబాగార్డెన్స్‌లోని ప్రేమ ఉన్నత పాఠశాల, రైల్వే న్యూకాలనీలోని కేపీఎస్ఎం బాలికల పాఠశాల, కంచరపాలెంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ బ్లాక్, మల్కాపురంలో జీవీఎంసీ ప్రాథమిక పాఠశాల, గోపాలపట్నంలో జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో 10వ తరగతి గది, చంద్రంపాలెం జడ్పీ ఉన్నత పాఠశాల, పద్మనాభంలో ఎంపీపీ ప్రాథమిక పాఠశాల, ఆనందపురంలో ప్రాథమిక పాఠశాల, భీమిలిలో మహాత్మాగాంధీ యూపీ పాఠశాలల్లో పోలింగ్ కేంద్రాలు ఏర్పాటుచేశారు. అన్ని పోలింగ్ కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుంది.

ఓటు హక్కు ఎవరికి ఉంటుందంటే...

ఉన్నత పాఠశాలల్లో బోధన చేసే స్కూల్ అసిస్టెంట్లు, హెచ్ఎంలు, కేజీబీవీలు, రెసిడెన్షియల్, మోడల్ స్కూళ్లు, జూనియర్/డిగ్రీ కళాశాలలు, పాలిటెక్నిక్, ఇంజనీరింగ్, యూనివర్సిటీ కళాశాలల అధ్యాపకులు, ప్రైవేటు పాఠశాలల్లో స్కూలు అసిస్టెంట్ కేడర్‌లో ఉన్న టీచర్లకు ఓటు హక్కు ఉంటుంది. ఈ ఎన్నికల్లో ఓటరు ప్రాధాన్యతా క్రమంలో ఓటు హక్కు వినియోగించుకోవచ్చు. ఉదాహరణకు ఒక అభ్యర్థికి మొదటి ప్రాధాన్య ఓటు వేస్తున్నట్టు అయితే పేరుకు ఎదురుగా ఉన్న గడిలో 'ఒకటి' అని నంబరు వేయాలి. టిక్‌లు పెట్టరాదు. ఓటరుకు బ్యాలెట్ పేపరుతోపాటు స్కెచ్ పెన్ను ఇస్తారు. ఆ పెన్ మాత్రమే ఉపయోగించి ఓటువేయాలి తప్ప ఇతర పెన్నులు వాడరాదు.

మూడో తేదీన ఓట్ల లెక్కింపు

ఎన్నికలలో కీలకమైన పోలింగ్ గురువారం సాయంత్రం నాలుగు గంటలతో ముగియనున్నది. నగరంలోని పోలింగ్ కేంద్రాల నుంచి బ్యాలెట్ బాక్సులను సాయంత్రం ఆరు గంటల తరువాత ఆంధ్ర విశ్వవిద్యాలయం ఇంజనీరింగ్ కళాశాలలోని ఈఈఈ విభాగం బ్లాక్‌లో భద్రపరుస్తారు. మిగిలిన జిల్లాల నుంచి గురువారం రాత్రికి బ్యాలెట్‌బాక్సులు వస్తాయి. వచ్చే నెల మూడో తేదీన ఓట్ల లెక్కింపు జరుగుతుంది. దీనికి సంబంధించి కౌంటింగ్ సిబ్బందికి రెండు రోజుల్లో శిక్షణ ఇవ్వనున్నారు.

పోటీలో ఉన్న అభ్యర్థులు...

సిట్టింగ్ ఎమ్మెల్సీ పాకలపాటి రఘువర్మ, కోరెడ్ల విజయగౌరి, గాదె శ్రీనివాసులనాయుడు, కోసూరు రాధాకృష్ణ, నూకల సూర్యప్రకాష్, రాయల సత్యనారాయణ, సత్తలూరి పద్మావతి, పెదపెంకి శివప్రసాద్, పోతల దుర్గాప్రసాద్, సుంకర శ్రీనివాసరావు (ఈయన పోటీ నుంచి తప్పుకుంటున్నట్టు వారం క్రితం ప్రకటించారు)

పల్సస్ ఉద్యోగుల పాట్లు

... 5వ పేజీ తరువాయి

భవనం ఖాళీ చేసి రుషికొండకు కార్యాలయం మార్చారు. అక్కడ 350 మంది వరకు పనిచేస్తున్నారు. నవంబరు నెల జీతంలో సగం డిసెంబరులో ఇచ్చి, మిగిలిన సగం జనవరిలో పండుగ ముందు అది కూడా కొందరికే ఇచ్చారు. డిసెంబరు జీతాలు ఇవ్వలేదు. ఎవరైనా జీతాలు ఎప్పుడు ఇస్తారని హెచ్ఆర్ ఉద్యోగిని ప్రశ్నిస్తే ఆమె హైదరాబాద్ వెళ్లి యాజమాన్య ప్రతినిధులను అడగాలని సూచించేది. స్థానికంగా శ్రీనుబాబు సోదరుడు శంకర్ డైరెక్టర్‌గా ఉన్నా సమస్య పరిష్కారం కాలేదు. ఇటీవల కొందరిని హైదరాబాద్ బదిలీ చేశారు. స్థానికంగానే ఉండవచ్చునని, ఇక్కడ తక్కువ జీతాలకు పనిచేశామని, హైదరాబాద్‌కు తీసుకువెళ్లి అవే జీతాలు ఇస్తే ఎలా సరిపోతాయని వాపోతున్నారు.

పీఎఫ్ ఖాతాలు స్తంభన

ఉద్యోగులకు సంబంధించి ప్రతి నెలా ప్రావిడెండ్ ఫండ్ కంపెనీ జమ చేయాలి. కానీ అది కూడా సరిగా చెల్లించడం లేదని ఉద్యోగులు తెలుసుకొని, తమ ఖాతాల్లో ఎంత ఉంటే అంత తీసుకోవాలని యత్నించారు. ఈ క్రమంలో వారి ఖాతాలు డిసెంబరులో స్తంభించినట్టు తెలిసి హతాశులయ్యారు. ఎప్పటి నుంచో పనిచేస్తున్న వారిని కొత్త ఉద్యోగులుగా చూపిస్తున్నారని కూడా ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఎక్కువ మందికి తాను ఉపాధి కల్పిస్తున్నట్టు ప్రచారం చేసుకోవడానికి ఇలా చేస్తున్నారని ఉద్యోగులు ఆరోపిస్తున్నారు.

వర్క్ ఫ్రమ్ హోమ్

ఉద్యోగులు జీతాలు ఇవ్వడం లేదని కార్యాలయం ముందు ధర్నా చేయడం, పత్రికల్లో వార్తలు రావడంతో కొత్త ఎత్తుగడ వేశారు. ఎవరూ ఆఫీస్‌కు రావద్దని ఇంటి నుంచే పనిచేయాలని 'వర్క్ ఫ్రమ్ హోమ్' నోటీసులు పంపించారు. అయితే ఉద్యోగుల ఇళ్లలో ఎటువంటి కంప్యూటర్లు ఏర్పాటు చేయలేదు. ఇంటర్నెట్ సౌకర్యం కల్పించలేదు. జీతాలు ఎప్పుడు ఇస్తారో తెలియని ఉద్యోగానికి ఇప్పుడు తాము అవన్నీ ఎక్కడ నుంచి సమకూర్చుకుంటామని ఉద్యోగులు ప్రశ్నిస్తున్నారు. గతంలో కూడా ఇలాగే చేశారని, అప్పుడు లక్ష్యాలు సాధించలేకపోయిన వారికి, ఆఫీస్‌కు రాలేదని రిమార్కు చూపించి జీతాలు ఇవ్వలేదని కొందరు ఉద్యోగులు ఆరోపించారు. సంస్థను సరిగ్గా నిర్వహించే ఉద్దేశం యాజమాన్యంలో కనిపించడం లేదని తమకు రావలసిన జీతం బకాయిలు ఇప్పించడానికి స్థానిక నాయకులు యత్నించాలని వారంతా డిమాండ్ చేస్తున్నారు.

ట్రిబ్యునల్‌లో కేసు ఉంది

నిబంధనలకు లోబడే ఉద్యోగులను హైదరాబాద్‌కు తరలించాం. విశాఖలో కొంతమంది ఉద్యోగుల యూనివర్సల్ అకౌంట్ నంబర్లను ఈపీఎఫ్ఓ బ్లాక్ చేసింది. దాంతో సమస్య ఏర్పడింది. దీనిపై మేము సెంట్రల్ గవర్నమెంట్ ఇండస్ట్రియల్ ట్రిబ్యునల్‌ను ఆశ్రయించాము. సంస్థకు అనుకూలంగా తీర్పు వచ్చింది. త్వరలో సమస్య పరిష్కారం అవుతుంది.

-గేదెల శ్రీనుబాబు, సీఈఓ, పల్సస్

ఉక్కులో ఉద్యోగాల కోత?

... 5వ పేజీ తరువాయి

భూములు ఇచ్చిన రైతులకు ఉద్యోగాలు ఇస్తామని అప్పట్లో ప్రకటించారు. వారిలో కొందరికే ఇచ్చారు. ఇంకా ఉద్యోగాలు పొందాల్సిన నిర్వాసితులు ఎనిమిది వేల మంది ఉన్నారు. ప్లాంటు విస్తరిస్తే తమకు ఉపాధి దొరుకుతుందని వారి వారసులు ఎదురుచూస్తున్నారు. అయితే యాజమాన్యం ఉన్నవారినే తొలగించుకుంటూ పోతుంటే...ఇక కొత్త ఉద్యోగాలు ఎక్కడ వస్తాయనే ప్రశ్న ఉత్పన్నమవుతోంది. దీనిని బట్టి భవిష్యత్తులో నిర్వాసితులకు ఉద్యోగాలు దొరికే అవకాశమే లేదనే వాదన వినిపిస్తోంది.

గ్రేటర్‌లో కమీషన్ కలకలం

... 5వ పేజీ తరువాయి

ఒక అధికారి...కమీషన్లు ఇస్తున్న కాంట్రాక్టర్ల బిల్లులు ప్రాసెస్ చేస్తున్నట్టు ఆరోపణలు ఉన్నాయి. తనకు అస్మదీయులైన, తనను ప్రసన్నం చేసుకున్న కాంట్రాక్టర్లను పిలిచి...ఏదో ఒక కారణంతో డబ్బు అవసరమైనందున త్వరగా బిల్లు చెల్లించాలని కమిషనర్‌కు ఒక దరఖాస్తు పెట్టిస్తుంటారని, ఆయన దానిని పరిశీలించాల్సిందిగా సూచిస్తే సదరు అధికారి వెంటనే బిల్లులను చెల్లిస్తుంటారని అంటున్నారు. వాస్తవంగా ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న కాంట్రాక్టర్లు కుటుంబసభ్యుల ఆరోగ్య సమస్యలు, పిల్లల చదువులు, పెళ్లిళ్ల కోసం డబ్బులు అవసరమై కమిషనర్‌కు దరఖాస్తు చేసుకుంటారు. ఆ దరఖాస్తును పరిశీలించాలని కమిషనర్ సదరు అధికారిని ఆదేశించినా సరే తనను ప్రసన్నం చేసుకోలేదనే సాకుతో వాటిని పక్కనపడేసేవారనే కాంట్రాక్టర్లు ఆరోపిస్తున్నారు. కాగా కాంట్రాక్టర్ల సంఘంలో ఇప్పుడు వర్గపోరు మొదలవ్వడంతో పోటాపోటీగా సమావేశాలు పెట్టి ఒకరిపై ఒకరు ఆరోపణలు చేసుకుంటున్నారు. అకౌంట్స్ విభాగంలోని అధికారి కోసమంటూ తమ నుంచి నాలుగు శాతం కమీషన్ కింద వసూలుచేసినందున సదరు అధికారి ఎవరనేది బయటపెట్టాలని కొందరు కాంట్రాక్టర్లు పట్టుబడుతున్నారు. ఈ వ్యవహారంపై జీవీఎంసీ ఇన్‌చార్జి కమిషనర్ అయిన జిల్లా కలెక్టర్ గట్టిగా దృష్టిసారిస్తే భవిష్యత్తులో అడ్డదారిలో బిల్లుల చెల్లింపునకు బ్రేక్ పడుతుంది.


ఆర్కే బీచ్‌లో ఏర్పాటు చేసిన కోటి శివలింగం

హరోం హర!

భక్తిశ్రద్ధలతో శివరాత్రి పూజలు

- కిటకిటలాడిన ఆలయాలు
- ఆర్కే బీచ్‌లో కన్నుల పండువగా మహా కుంభాభిషేకం
- వేలాదిగా తరలివచ్చిన భక్త జనం

మహా శివరాత్రి సందర్భంగా బుధవారం జిల్లా వ్యాప్తంగా శైవక్షేత్రాలు భక్తులతో కిటకిటలాడాయి. తెల్లవారుజాము నుంచి ప్రత్యేక పూజలు, రుద్రాభిషేకాలు నిర్వహించారు. నగరంలోని ప్రధాన ఆలయాలతో పాటు గాజువాక సమీపంలోని అప్పికొండ ఆలయానికి పెద్దసంఖ్యలో భక్తులు తరలివచ్చారు. పలు ఆలయాల్లో మధ్యాహ్నం అన్నసమారాధన ఏర్పాటు చేశారు. మరోవైపు ఆర్‌కే బీచ్‌లో కేంద్ర మాజీ మంత్రి టి.సుబ్బరామిరెడ్డి ఆధ్వర్యంలో కోటి లింగాలకు మహా కుంభాభిషేకం కన్నుల పండువగా జరిగింది. వేలాదిగా తరలివచ్చిన భక్తులు స్వయంగా శివుడికి అభిషేకాలు చేశారు. ఈ నేపథ్యంలో తీరప్రాంతం కిక్కిరిసిపోయింది. బీచ్‌రోడ్డు సందర్శకులతో నిండిపోయింది.

- విశాఖపట్నం, ఆంధ్రజ్యోతి


ఎంవీపీ కాలనీ ముక్తేశ్వర స్వామి ఆలయంలో అభిషేకాలు చేస్తున్న భక్తులు


నక్కవానిపాలెం శివాలయంలో అభిషేకం చేస్తున్న దృశ్యం


కేఆర్‌ఎం కాలనీ శివాలయంలో ధ్వజస్తంభం వద్ద మహిళల పూజలు


ఎంవీపీ కాలనీ శివాలయంలో స్వామి దర్శనానికి బారులు తీరిన భక్తులు

వైభవంగా శ్రవణ పూజలు

ఆరిలోవ, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి) : చినగదిలిలో ఉన్న కల్యాణ వేంకటేశ్వర ఆలయంలో బుధవారం ఉదయం వెంకటేశ్వర స్వామి జన్మ నక్షత్ర పూజలు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామికి అనేక రకాలు పండ్ల రసాలు, చందనం, వెన్నతో అషేకాలు నిర్వహించారు. వేద పండితులు ఆచార్యులు వేదమంత్రాల మంత్రాలు మంగళవాయిద్యా మధ్యఈ పూజలు జరిగింది. అనంతరం వేంకటేశ్వర స్వామిని పట్టు వస్త్రాలు, పూలతోను అలంకరంచారు. అదిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

టీడీఆర్ హబ్‌ను రెడ్ బుక్‌లో నమోదు చేయాలి

వెంకోజీపాలెం, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి) : ఏయూలో దొంగ పీహెచ్‌డీ అడ్మిషన్ల కోసం టీడీఆర్ హబ్ ఏర్పాటు చేసిన విషయం తెలిసిందేనని, అయతే ఈ హబ్ రద్దవుతుందని ఒకసారి ఏయూ అధికారులు ప్రకటంచారని, మరోసారి యథావిధిగ కొనసాగుతుందన చెప్పారని, ఏది వాస్తవమో తెలియక గందరగోళం నెలకొందని ఏయూ పరిరక్షణ సమితి ఆదివారం ఒక ప్రకటన ద్వారా కోరింది. దీనిపై అసలు నిజాలను వెలుగులోకి తేవాలని, రెడ్ బుక్‌లో నమోదుచేయాలని డిమాండ్ చేసింది. బయట కళాశాలలో వర్క్ చేసే అభ్యర్థులకు గైడ్ షిప్ ఇవ్వడం జరిగిందని, సుమారు 400 పైగా వారు ఉన్నారని ప్రకటనలో పేర్కొన్నారు. అందులో 300కు పైగా అర్హత లేని వారేనని, అనేక మంది తెలియజేస్తున్నారన్నారు. ఎగ్జిక్యూ టివ్ కోటాలో పీహెచ్‌డీ ప్రవేశాలన్నీ అర్హతకు భిన్నంగా ఉన్నాయని సమిత పేర్కొంది.

సినిమా గైడ్

● **డ్రాగన్:** జగదాంబ, శ్రీకన్య, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), నటరాజ్-1 (పెందుర్తి), శ్రీకన్య (గాజువాక),
● **లైలా:** శ్రీ వెంకటేశ్వర-1, రమాదేవి, శ్రీరామా, గోకుల్, కిన్నెర, మోహిని (గాజువాక), మౌర్య (గోపాలపట్నం)
● **తండేల్ :** సంగం, కామేశ్వరి, శ్రీవెంకటేశ్వర, శ్రీలీలామహల్, ఊర్వశి (కంచరపాలెం), నరసింహ (గోపాలపట్నం), అన్నపూర్ణ(కూర్మన్నపాలెం), అరుణ (పెదగంట్యాడ)
● **సంక్రాంతికి వస్తున్నాం:** శారద, మెలోడి, జగదాంబ, కాంతి, శ్రీలక్ష్మీనరసింహ-1,2 (104 ఏరియా), శ్రీనరసింహ (గోపాలపట్నం), లిఖిత (శ్రీహరిపురం), తాతా, రాములమ్మ (తగరపువలస)
● **డాకు మహారాజ్:** శరత్, కిన్నెర, మోహిని కాంప్లెక్స్, శ్రీకన్య హెవెన్ (గాజువాక), గణేష్, సప్తగిరి (తగరపువలస)
● **గేమ్ ఛేంజర్:** మెలోడి, సంగం, కామేశ్వరి, గోకుల్, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), ,కన్యకాంప్లెక్స్, మోహిని కాంప్లెక్స్ (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), సీతారామయ్య (పరవాడ), నటరాజ్-2 (పెందుర్తి) రాములమ్మ (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 33, టమాటా 14, వంకాయలు (తెలుపు)20, వంకాయలు (నలుపు) 15, బెండకాయలు 42, పచ్చిమిర్చి 26, కాకరకాయలు 36, బీరకాయలు 60, ఆనపకాయ 16, కాలీఫ్లవర్ 14, క్యాబేజి 12, క్యారెట్ 28 దొండకాయలు 32, బంగాళ దుంపలు 14, అరటికాయ (పె)6, మునక్కాడలు (కిలో) 62, అల్లం (పాతది)52, బరబాటి 30, ముల్లంగి 20, నిమ్మకాయలు (కిలో) 65, బద్దచిక్కుడు 26, దోస కాయలు 24, వెల్లుల్లి (పెద్దవి) 100, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 32, కీరదోస 26, కాప్సికమ్ 38, పొట్లకాయ (పెద్దది) 28, చేమ దుంపలు 38 చిలగడదుంపలు 40, కంద 64, దేముడు చిక్కుడు 40, గోరు చిక్కుడు 36, కూర పెండలం 26, బ్రకోలి 55 , నూల్ కోల్ 30, పనసపొట్టు 200, కొండఉసిరి 70, కరివేపాకు (కిలో) 60, కొత్తిమీర (పెద్దకట్ట) 15, పుదీన (కట్ట) 4, చుక్కకూర (కట్ట) 4, పాల కూర (కట్ట) 4, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 80, బూడిద గుమ్మడికాయ 30, కర్రపెండలం 22, మామిడి అల్లం 46, బొప్పాయి 42, జామకాయలు (కిలో) 60.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	482
విజయనగరం	486
శ్రీకాకుళం	486

చికెన్ ధరలు

బ్యాగ్	
రైతు ధర	71
లైవ్ ధర	91
విత్ స్కిన్	152
స్కిన్‌లెస్	162

శివాలయాల్లో అభిషేకాలు, ప్రత్యేక పూజలు

- వేకువ జాము నుంచే ఆలయాలకు పోటెత్తిన భక్తులు
- వీరభద్ర స్వామి ఆలయంలో సందడే సండడి
- సాయంత్రం పలు చోట్ల భక్తి, ఆధ్యాత్మిక కార్యక్రమాలు


శ్రీ కాశీ విశ్వేశ్వర ఆలయంలో శివుడికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న భక్తులు


ఎంవీపీ కాలనీ : సత్యసాయి ప్రేమ్‌సదన్ మందిర్‌లో జరిగిన మహాశివరాత్రి వేడుకల్లో పాల్గొన్న భక్తులు


వెంకోజీపాలెం : వీరభద్ర స్వామి ఆలయం వద్ద భక్తుల రద్దీ

వెంకోజిపాలెం, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి) : మహా శివరాత్రి సందర్భంగా బుధవారం వేకువ జాము నుంచే శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఇసుకతోటలోని వీరభద్రస్వామి ఆలయంలో సందడి నెలకొంది. స్వామి కుటుంబీకులు తప్ప ఏడాది పొడవునా ఇటువైపు కన్నెత్తి కూడా చూడని భక్తులు ఒక్క మహాశివరాత్రి పర్వదినాన మాత్రమే ఇక్కడ సంబరాలు, ఉత్సవాలు జరుపుకుంటారు. ఏడాదికోసారి ఘనమైన పూజలు... భక్తుల తాకిడి.. సంబరాలు... ఉత్సవాలు.. ఇది ఇసుకతోటలోని వీరభద్రస్వామి ఆలయం ప్రత్యేకత. మద్దిలపాలెంలోని అచ్చి అప్పలరెడ్డి కుటుంబంలో జన్మించిన వీరభద్రస్వామి వివాహం కాకుండానే చనిపోయారు. అప్పటి నుంచి వీరభద్రుడిగా తన కుటుంబీకులకు దర్శనమివ్వడం ఆరు దశాబ్దాల క్రితం ఇక్కడొక ఆలయాన్ని కుటుంబీలకులతో నిర్మించుకోవడం జరిగింది. తన కుటుంబీకుడైన వీరభద్రస్వామికి ఆమె తల్లి అచ్చి అప్పయమ్మ ప్రతీ యేటా శివరాత్రి రోజున సనికాళ్లను చేత పట్టి మంగళవాయిద్యాలు, మేళతాళాలతో మద్దిలపాలెంలోని తమ ఇంటి వద్ద నుంచి ఈ ఆలయానికి ఊరేగింపుగా వచ్చి, స్వామికి సమర్పిస్తుంటారు. అయితే తల్లి అచ్చి అప్పయ్యమ్మ మరణించడంతో వీరభద్రస్వామి సోదరుడు అచ్చి మహా విష్ణు, అతడి తనయుడు అచ్చి సత్య రెడ్డి ఈ పూజా కార్యక్రమాన్ని చేపట్టారు. బుధవారం ఆలయానికి వచ్చి స్వామిని దర్శించుకున్నారు. తప్పెటగుళ్లు, కోలాటం, పులి వేషాలు, బలవేషాలతో ఆ ప్రాంతమంతా సందడి నెలకొంది. ఏడాది పొడవునా నిర్మానుష్యంగా ఉండే ఆలయ ప్రాంగణమంతా భక్తులతో కిటకిటలాడింది. వీరభద్రస్వామికి భక్తుఉ కానుకలు సమర్పంచడం, హారతులు పట్టడంతో ఈ ప్రాంతమంతా భక్తి పారవశ్యంతో మునిగిపోయింది. ఓం నమ శివాయ.. అంటూ భక్తులు ప్రార్థనలు చేశారు. ఉదయం నుంచి గౌరీదేవీగా కొలిచే రావి చెట్టు, ఈశ్వరుడిగా భావించే జమ్మి చెట్టు కలిసి ఉన్న ఈ ప్రాంతంలో వీరభద్రస్వామికి అత్యంత భక్తిశ్రద్ధలతో పూజలు జరిపారు. ఈ పూజల్లో స్వామి కుటుంబీకులతో పాటు, చుట్టు పరిసర ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని పూజలు చేపట్టారు. అలాగే 16వ వార్డులోని పాత వెంకోజీపాలెంలో వేంచేసి ఉన్న వీరబాబు ఆలయం వద్ద తెల్లవారు జాము నుంచి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించి, మధ్యాహ్నం భక్తులకు మహా అన్నదాన కార్యక్రమం కూడా చేపట్టారు. ఈ కార్యక్రమంలో శ్రీ రాధాకృష్ణ యాదవ సేవా సంఘం సభ్యులు పాల్గొన్నారు.

పెదవాల్తేరులో...

పెదవాల్తేరు (ఆంధ్రజ్యోతి) : స్థానిక శ్రీకాశీవిశ్వేశ్వర ఆలయంలో వేకువ జాము నుంచి భక్తులు బారులు తీశారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణాన్ని అలంకరించి, విద్యు దీపాలు ఏర్పాటు చేశారు. వేకువ జాము నుంచి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం ఆరు గంటల నుంచి రాత్రి ఒంటి గంట వరకు రుద్రాభిషేకాలు నిర్వహించనట్టు ఆలయ కమిటీ చైర్మన్ సీహెచ్ జ్యోతి తెలిపారు.భక్తులకు ఏటువంటి ఇబ్బందులు కలగ కూండా ఆలయ కమిటి అన్ని ఏర్పాట్లు చేశారు. అనంతరం భక్తులకు ఉచిత ప్రసాదం పంపిణి చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు సీహెచ్ జ్యోతి, అర్చకులు కాళీప్రసాద్, చినఅప్పారావు, వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీ సత్యసాయిప్రేమ్ సదన్‌లో..

ఎంవీపీ కాలనీ, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి) : ఎంవీపీ కాలనీలోని శ్రీ సత్యసాయిప్రేమ్ సదన్‌లో మహా శివరాత్రి సందర్భంగా బుధవారం ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. శ్రీ సత్యసాయి సేవా సంస్థలు, శ్రీ సత్యసాయి సేవా సమితి సంయుక్తంగా ఏర్పాటుచేసిన కార్యక్రమాల్లో ఉదయం ఎనిమిది గంటల నుంచి సామూహిక వివిధ ఫలరసామృత అష్టోత్తర శత కలశ ఏకాదశ రుద్రాభిషేకం, బిల్వార్చన, అమ్మవారికి కుంకుమార్చన, రుద్రహోమం, పూర్ణాహుతి నిర్వహించారు. మధ్యాహ్నం ప్రసాద వితరణ, సాయంత్రం 4 గంటల నుంచి పార్వతీ పరమేశ్వరుల కళ్యాణమహోత్సవం, అమ్మవారు, అయ్యవార్లకు మందిర పురవీధుల్లో మంగళవాయిద్యాలు, వేదపఠనం, భజనలు, సాముగరిడీల మధ్య పల్లకీ సేవ నిర్వహించారు. సాయిరుద్రపారాయణ, అష్టోత్తరం, జ్యోతి ప్రజ్వలనతో అఖండ దివ్యనామ సంకీర్తన నిర్వహించారు. శ్రీ సత్యసాయి సేవా సమితి కన్వీనగర్ డీవీవీ సీతారామరాజు, శ్రీ సత్యసాయి సేవా సమితి జిల్లా అధ్యక్షుడు పీఆర్‌ఎస్‌ఎన్ నాయుడు పర్యవేక్షించారు.

ఆరిలోవలో..

ఆరిలోవ : మహా శివరాత్రి సందర్భంగా ఆరిలోవ ప్రాంతంలో అన్ని శివాలయాలు భక్తులతో నిండిపోయాయి. వేకువ జాము నుంచి శివాలయాలకు భక్తుల తాకిడి పెరిగింది. అంతా క్యూలైన్‌లో నిలబడి శివుడికి ప్రత్యేక అభిషేకాలు చేశారు. ఈ సందర్భంగా పెదగదిలిలోగల కాశీఅన్నపూర్ణ సహిత విశ్వేశ్వర ఆలయం, ఆరిలోవ టైన పాయింట్‌సమీపంలో నాగలింగేశ్వర స్వామి ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఆరిలోవ డ్రైవర్‌కాలనీలోని బాలా త్రిపుర సుందరీ ఆలయానికి మేయర్ గొలగాని హరివెంకటకుమారి కుటంబ సమేతంగా వచ్చి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. సాయంత్రం ఆరు గంటలకు నిర్వహించిన కోలాటం, భక్తగీతాల గాత్ర కచేరి ఎంతగానో అలరించాయి. రాత్రి 12 గంటలకు లింగోద్భం కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఆరిలోవ ఆఖరి బస్టాపు సమీపంలో గల వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయం వార్షికోత్సవంలో భాగంగా వీరబ్రహ్మేంద్ర స్వామి వారి కాల్యాణం చేశారు. రాత్రి పది గంటలకు శివ పార్వతులు కల్యణం కన్నుల పండగగా జరిపారు. శివాజీనగర్-2లో గల ద్వాదశ జ్యోతిర్లింగేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేపట్టారు. ఈ ఆలయంలో భక్తులు స్వయగా శివలింగాలకు అభిషేకం చేశారు.

శివరాత్రి క్రీడా పోటీలు


క్రికెట్ ఆడుతున్న యువకులు

వెంకోజీపాలెం, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి) : ఒకప్పుడు శివరాత్రి వస్తే మహిళలు జాగారం చేసి, ఉపవాసాలతో కాలాన్ని జాగారాం చేసి, మరుసటి రోజు సముద్ర స్నానాలకు వెళ్లే వారు. చిన్నారులు, యువకులు రోడ్లపై ఆటలు ఆడుకుంటూ గడిపే వారు. ప్రస్తుతం కాలం మారింది. మహిళల్లో పూజలు చేసే వారి సంఖ్య తగ్గింది. కానీ యువకుల్లో మాత్రం కొత్తరకం ఆలోచనలు పెరుగుతున్నాయి. ఈ క్రమంలో శివరాత్రిని పురస్కరించుకుని 16వ వార్డు హెచ్‌బీ కాలనీ అబ్దుల్ కలాం పార్కులో యువకులు క్రికెట్ పోటీలు, షెటిల్ పోటీలను నిర్వహించుకున్నారు. హోరాహోరీగా అవుతున్న ఐపీఎల్ మాదిరే క్రికెట్ ఆటగాళ్ల కొనుగోలు నుంచి టీంలను ఏర్పాటు చేసుకుని, క్రికెట్ మ్యాచ్‌లను ఆడారు. గెలుపొందిన వారికి నగదు బహుమతులను కూడా అందజేశారు. అలాగే షటిల్ ఆటగాళ్లు కూడా తమదైన శైలిలో పోటీలను నిర్వహించుకున్నారు. పార్కులో ఉన్న ఐమాస్టు లైటుతో పాటు, పార్కు చుట్టూ ప్రత్యేక లైట్లను కూడా యువకులు ఏర్పాటు చేసుకుని శివరాత్రి ప్రత్యేక ఆటలను ఆడారు.

శివాలయాల్లో పూజలు

వెంకోజిపాలెం. ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి) : లమహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని కొత్తవెంకోజిపాలెంలోని శ్రీ జ్ఞానానంద ఆశ్రమం, గౌరీ జ్ఞానలింగేశ్వరాలయం దేవస్థానంలో, కేఆర్‌ఎం కాలనీ, ఇసుకతోట, హెచ్‌బీ కాలనీ, శివాలయాలలో బుధవారం ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. వెంకోజిపాలెంలోని ఆలయ ప్రధానార్చకులు అరవెల్లి సూర్యప్రకాశ్ శర్మ సారధ్యంలో అర్చక బృందం రామకృష్ణ శర్మ, సుబ్రహ్మణ్యశాస్త్రి, బాల బాస్కర శర్మ, ప్రభాకరశర్మ, సాయిలు భక్తుల గోత్ర నామాలతో అర్చనలు చేశారు.



నిమగ్న నృత్య రూపకం ప్రదర్శిస్తున్న రమా వైద్యనాథన్ బృందం, ప్రదర్శనను తిలకిస్తున్న ఎంపీ శ్రీభరత్, సీపీ శంఖబ్రత బాగ్చీ, టీడీపీ నాయకులు

అలరించిన నిమగ్న నృత్య రూపకం

బీచ్ రోడ్డు, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రి సందర్భంగా ఆర్కేబీచ్ విశ్వప్రియ ఫంక్షన్‌హాలు ఎదురుగా రమా వైద్యనాథన్ బృందం ప్రదర్శించిన నిమగ్న నృత్యరూపం అలరించింది. భారతీయ సంప్రదాయ నృత్య వైభవాన్ని ప్రతిబింబిస్తూ భక్తి, తత్వశాస్త్రం, జీవిత సత్యాలను కలగలిపిన ప్రదర్శన మంత్రముగ్ధుల్ని చేసింది. ఈ సందర్భంగా రమావైద్యనాథన్ మాట్లాడుతూ నాట్యం అంటే పరిపూర్ణ సమర్పణ అన్నారు. ఈ ప్రదర్శన ద్వారా ప్రేక్షకులకు వినూత్న అనుభూతికి గురిచేయడమే లక్ష్యమన్నారు. పరంపర ఫౌండేషన్ ద్వారా మరిన్ని ప్రదర్శనలు ఏర్పాటు చేస్తామని నిర్వాహకులు ప్రకటించారు. కార్యక్రమంలో ఎంపీ ఎం.శ్రీభరత్, సీపీ డా.శంఖబ్రతబాగ్చి, టీడీపీ జిల్లా అధ్యక్షుడు గండి బాబ్జీ, ఎన్టీఆర్ వైద్యసేవా ట్రస్టు వైస్‌చైర్మన్ సీతంరాజు సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కేంద్ర మాజీ మంత్రి సుబ్బిరామిరెడ్డి, వేదికపై ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, సినీ నటుడు బ్రహ్మానందం తదితరులు

నాగఫణిశర్మకు అవధాన బ్రహ్మ బిరుదు ప్రదానం

బీచ్‌రోడ్, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ అవధాని మాడుగుల నాగఫణి శర్మకు టి.సుబ్బరామిరెడ్డి ఫౌండేషన్ బుధవారం అవధాన బ్రహ్మ బిరుదు ప్రదానం చేసింది. మహాశివరాత్రి సందర్భంగా ఆర్కేబీచ్‌లో కోటి లింగాలకు మహాకుంభాభిషేకం నిర్వహించిన అనంతరం నాగఫణిశర్మకు బిరుదుతో పాటు రూ.5 లక్షల నగదు బహుమతిని కేంద్ర మాజీ మంత్రి టి.సుబ్బిరామిరెడ్డిచ సినీ నటుడు బ్రహ్మానందం, భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అందజేసి సత్కరించారు. ఈ సందర్భంగా సినీనటుడు బ్రహ్మానందం మాట్లాడుతూ విశాఖ తీరంలో ఏటా మహాశివరాత్రి పర్వదినాన కోటి లింగాలు ఏర్పాటుచేసి మహాకుంభాభిషేకం నిర్వహించడం చాలా గొప్ప విషయమన్నారు. గత 40 ఏళ్లుగా ఈ కార్యక్రమం భక్తిభావాన్ని పెంపొందిస్తోందన్నారు.

డివైడర్‌పై ఆహార వ్యర్థాలు


డివైడర్లపై మొక్కల మధ్య పడేసిన వ్యర్థాలు

ఎంవీపీ కాలనీ, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి) : స్థానికంగా రహదారుల పక్కన వ్యాపారాలు నిర్వహించే చిరు వ్యాపారులు ప్రతి రోజూ ఆహార వ్యర్థాలు, నీరు డివైడర్లపై పారబోస్తుండడంతో సమస్యగా మారుతోంది. దీని వల్ల వాహనదారులు ఇబ్బందులకు గురవుతున్నారు. ఆహార పదార్థాల వ్యర్థాలు కుళ్లిపోవడంతో దుర్గంధం వ్యాపిస్తోందని స్థానికులు వాపోతున్నారు. పరిసరాలు కూడా అపరిశుభ్రంగా తయారవుతున్నాయి.

ఎంవీపీ కాలనీ ప్రధాన సర్కిల్ నుంచి టాస్క్‌ఫోర్స్ సర్కిల్ వరకూ రహదారికి ఓ పక్క ఫాస్ట్ ఫుడ్ సెంటర్లు ఎక్కువగా ఉన్నాయి. రోజూ వ్యాపారం ముగిశాక ఆ వ్యాపారులు మిగిలిన వ్యర్థాలను బయటకు తరలించకుండా డివైడరుపై పడేస్తున్నారు. దీంతో రెండు వైపులా రోడ్లపై ప్రయాణించే వారికి దుర్గంధం వ్యాపిస్తోంది. పారిశుధ్య సిబ్బంది పట్టించుకోకపోవడం లేదు. జీవీఎంసీ అధికారులు ఎలాంటి చర్యలు చేపట్టకపోవడంతో వ్యాపారులకు ఇది అలవాటుగా మారింది. ప్రతి రోజూ ఉదయం క్షేత్ర పర్యటనల్లో భాగంగా ఉదయాన్నే పలువురు జీవీఎంసీ అధికారులు ఇటు వైపు వస్తుంటారు. అయినప్పటికీ ఎవరూ పట్టించుకోవడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా గ్రేటర్ అధికారులు ఈ విషయంలో స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

ఆ విద్యుత్ స్తంభాలను తొలగించరూ!


రోడ్డు పక్కనే వేసి వదిలేసిన విద్యుత్ స్తంభాలు

ఎంవీపీ కాలనీ, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి) : ఎంవీపీ డబుల్ రోడ్డులో ఓ పక్కన చాలా రోజుల నుంచి విద్యుత్తు స్తంభాలు పడి ఉన్నాయి. నెలలు గడుస్తున్నా వీటిని ఇక్కడ నుంచి తరలించడం లేదు. రాత్రి వేళల్లో ఇవి ప్రమాదకరంగా మారుతున్నాయి. దీనివల్ల రాత్రి సమయంలో పొరపాటున కాస్త రోడ్డు పక్కకు వచ్చే ద్విచక్ర వాహనదారులు రోడ్డు ప్రమాదాలకు గురవుతున్నారు. ముఖ్యంగా వేగంగా వెళ్లే ద్విచక్ర వాహనదారులు ఈ స్తంభాలను గుర్తించలేక ఢీకొని ప్రమాదాలకు గురై గాయాల పాలవుతున్నారు. వీటిని ఇక్కడ నుంచి తొలగించాలని అధికారులకు ఎన్ని ఫిర్యాదులు చేసినా పట్టించుకోవడం లేదని స్థానికులు, వాహనదారులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డు పక్కన వేసిన విద్యుత్ స్తంభాలను తొలగింపునకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

రామనామం.. బహు శక్తివంతం

- ప్రముఖ ఆధ్యాత్మిక ప్రవచనకర్త చాగంటి కోటేశ్వరరావు

కొమ్మాది,ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): మరణిస్తున్న వారిని కూడా బతికించగలిగిన సంజీవిని శ్రీరామనామమని, ఎంతపెద్ద తప్పుచేసినా తప్పు తెలుసుకుని తన వద్ద శరణాగతి చేస్తే రాముడు కాపాడతాడని ప్రముఖ ఆధ్యాత్మిక ప్రవచనకర్త, బ్రహ్మశ్రీచాగంటి కోటేశ్వరరావు పేర్కొన్నారు. కొమ్మాది గాయత్రి మహిళా ఇంజనీరింగ్ కళాశాల ఆవరణలో నిర్వహిస్తున్న సంపూర్ణ రామాయణం ప్రవచనాల్లో భాగంగా బుధవారం సుందరకాండలోని సిద్ధిసర్గ గురించి వివరించారు. శ్రీరాముడిని భౌతికంగానే కాకుండా ఆయన గుణగణాలను కూడా పూర్తిగా ఉపాసన చేసిన మహానుబావుడు హనుమంతుడు అన్నారు. సీతమ్మ గుణగణములను చూసి ఆనందపరవశులైన హనుమంతుడు మాట్లాడకుండా ఉండిపోవడం, రావణుడి రాక్షసత్వానికి పరాకాష్ట అని తాను అనుభవిస్తున్న ఘోరమైన బాధను తాళలేక సీతమ్మ మరణించటానికి సిద్ధపడగా, అది మాయమానుష స్వరూపిణి అయిన ఆవిడ స్వామి హనుమ మాట్లాడటానికి ప్రేరేపించిన ఒక విషయమని తెలిపారు. సీతమ్మకు, హనుమకు జరిగిన సంభాషణ, రాముడు పంపిన అంగుళీయకము సీతకు చూపించడం సీతమ్మ కరవిభూషణమును తీసుకుని శ్రీరాముడే వచ్చినంత సంబరపడటం ఇక రావణసంహారం జరగబోతోందని మండళకరమైన ఘట్టాన్ని వివరించారు.